ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 13 ఫిబ్రవరి 2025


నిలిచిపోయిన ట్రాఫిక్

● భక్తజనసంద్రం

సింధుస్నానాలకు వచ్చిన భక్తులతో బుధవారం హంసలదీవి సముద్రతీరం కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాల్లోని నలుమూలల నుంచి 30 వేల మంది వరకు భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. హంసలదీవి నుంచి పాలకాయితిప్ప వరకు మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవటంతో కొన్ని ఇబ్బందులు ఏర్పడ్డాయి.

6లో



పట్టువస్త్రాల్లోనూ పట్టుబడ్డారు

దుర్గమ్మ మూలవిరాట్ వస్త్రాల్లోనూ అవినీతి

రూ.5,900 ధర కలిగిన ధోవతి స్థానే కేవలం రూ.450 నుంచి రూ.600 విలువైన ధోవతి.. రూ.6 వేల విలువైన చీర స్థానే కేవలం రూ.1,000 చీర.. సాక్షాత్తూ జగన్మాత సన్నిధిలో అక్రమార్కులు ఆడిన పాపకార్యమిది. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు నిత్యం అలంకరించే పట్టుచీరల సరఫరాకు నిర్వహించిన టెండర్ల కిరికిరిలో నిజాలు ఇప్పటికే బయటపడ్డాయి. ఈ పాపంలో భాగస్వామి అయిన జూనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరెడ్డిని బుధవారం సస్పెండ్ చేశారు.

- టెండర్ సమయంలో నాణ్యత కలిగిన శాంపిళ్లు
- సరఫరా చేస్తున్నది మాత్రం నాణ్యతలేనివి
- రూ.5,900 ధోవతి స్థానే రూ.450 ధోవతి
- రూ.6 వేల చీర స్థానే రూ.1,000 చీర
- విచారణలో బయటపడిన నిజాలు
- జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అమ్మవారి మూలవిరాట్‌కు రోజూ ఏడు చీరలు అలంకరిస్తారు. వాటిని సరఫరా చేయటానికి గతంలో టెండర్లు ఆహ్వానించారు. 2024, ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు చీరలు సరఫరా చేయాలని పిలిచిన టెండర్లలో క్రోసూరుకు చెందిన శ్రీసాయి మణికంఠ ఏజెన్సీస్ 17 రకాలు, నగరంలోని బాలకృష్ణ శిల్క్స్ ఏడు రకాలు, కడపలోని నాగార్జున టెక్స్‌టైల్స్‌కు టెండర్లు దక్కాయి. వీరే టెండర్ ధర తక్కువ కోడ్ చేయటంతో చీరల సరఫరాకు అధికారులు ఆమోదం తెలిపారు. ఈ క్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారి.. టెండర్‌దారులు సరఫరా చేస్తున్న వస్త్రాలు మిగతా 6లో..

ఏమార్చారు..!

రైతులను మోసం చేసిన ట్రాన్స్‌కో

పేరుకు హైటెన్షన్ విద్యుత్ లైన్లకు మరమ్మతులు

నున్న-గుడివాడ 220 కేవీ ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ విద్యుత్ లైన్ల మార్పిడి విషయంలో రైతులకు ట్రాన్స్‌కో అధికారులు అన్యాయం చేశారు. రిపేర్లు చేస్తామని ప్రకటన ఇచ్చి.. ఏకంగా విద్యుత్ లైన్లనే మార్చేశారు. నిబంధనల ప్రకారం.. పాత లైన్ల స్థానే కొత్తవి మారిస్తే సదరు భూ యజమానులకు పరిహారం చెల్లించాలి. అయితే, ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతులు చేస్తున్నామని నమ్మబలికి, పరిహారాన్ని ఎగ్గొట్టి, ఆ సొమ్మును స్వాహా చేయడం వివాదాస్పదంగా మారింది.

- గుట్టుచప్పుడు కాకుండా కొత్త లైన్ల మార్పిడి
- నున్న-గుడివాడ 220 కేవీ పవర్ లైన్స్‌లో ట్రాన్స్‌కో నిర్వాకం
- భూ యజమానులకు పరిహారం ఇవ్వాల్సి వస్తుందనే..
- ఎకరాకు రూ.9 లక్షల మేర నష్టపోయిన రైతులు
- రూ.31.68 కోట్ల మేర రైతులకు నష్టం

విజయవాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నున్న-గుడివాడ 220 కేవీ సెక్షన్‌లో ట్రాన్స్‌మిషన్ విద్యుత్ హైటెన్షన్ లైన్లపై తీవ్ర ఒత్తిడి పడుతుందన్న ఉద్దేశంతో ఆ లైన్లను అప్‌గ్రేడ్ చేయాలని ట్రాన్స్‌కో అధికారులు భావించారు. లైన్లను మార్చే విషయంలో ట్రాన్స్‌కో అధికారులు రహస్య ఆపరేషన్ నిర్వహించారు. కేవలం మరమ్మతులు చేస్తున్నట్టుగా చూపించి, విద్యుత్ లైన్లను మార్చేశారు. కేవలం మరమ్మతులేనంటూ ఓ పత్రికలో ప్రకటన ఇచ్చారు. ఈ ప్రకటన వేసిన విషయం కూడా చాలామందికి తెలియదు. లైన్ల మరమ్మతులు జరుగుతున్నాయని ప్రచారం చేశారు. రైతులు కూడా మరమ్మతులే కదా.. అనుకున్నారు. కానీ, ట్రాన్స్‌కో అధికారులు తెలివిగా కొత్త విద్యుత్ లైన్లను మార్చారు. నున్న-గుడివాడ 220 కేవీ సెక్షన్ మొత్తం 44.5 కిలోమీటర్లు. 2007-08లో ఈ ట్రాన్స్‌మిషన్ లైన్లను వేశారు. అప్పట్లో ఏసీఎస్ఆర్ మిగతా 6లో..

దొంగచాటు పనులెందుకు..?

నున్న నుంచి గుడివాడ వరకు విద్యుత్ లైన్లను అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరమే లేదు. 2017లో గుడివాడలో 400 కేవీ విద్యుత్ లైన్లను వేయటానికి చర్యలు చేపట్టగా, రైతులు కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఈ కేసులు తేలలేదు. ట్రాన్స్‌కో అధికారులు ఈ కేసులను పరిష్కరించుకుంటే నున్న-గుడివాడ లైన్‌ను అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం లేదు.


నున్న-గుడివాడలో జరుగుతున్న పనులు

రైతులు ఎంత నష్టపోయారు?

నున్న-గుడివాడ 220 కేవీ సెక్షన్‌లో 44.5 కిలోమీటర్లు ఉండగా, కిలోమీటర్‌కు 1,000 మీటర్లు కాగా, 32.1 మీటర్ల మేర వెడల్పును కూడా కలిపి లెక్కిస్తే 14,24,000 మీటర్లు అవుతుంది. ఎకరాకు 4,040 చదరపు మీటర్లు కాబట్టి.. పై విలువతో భాగిస్తే 352 ఎకరాలు అవుతుంది. అంటే.. మొత్తం 350 ఎకరాలకు సంబంధించి ట్రాన్స్‌కో అధికారులు రైతులకు పరిహారం ఎగ్గొట్టారు. నున్న నుంచి గుడివాడ వరకు చూస్తే ఎకరం ధర బుక్ వాల్యూ ప్రకారం.. రూ.25 లక్షల నుంచి రూ.1.50 కోట్ల వరకు ఉంటుంది. ఎకరం రూ.30 లక్షలే అనుకున్నా.. అందులో 30 శాతం.. అంటే ఎకరాకు ఒక్కో రైతుకు రూ.9 లక్షల మేర నష్టపరిహారం చెల్లించాలి. ఈ లెక్కన 352 ఎకరాలకు రూ.31.68 కోట్ల మేర నష్టపరిహారం ఇవ్వాల్సి ఉండగా, నయాపైసా చెల్లించలేదు.


గంపలగూడెంలో మృతిచెందిన కోళ్ల నమూనాలు సేకరిస్తున్న వైద్యులు

బర్డ్‌ఫ్లూ కలవరం

జిల్లా సరిహద్దుల వెంబడి నిఘా

కోళ్లు, గుడ్లు రవాణా కాకుండా చర్యలు

పౌల్ట్రీ యజమానులను అప్రమత్తం చేసిన అధికారులు

- పౌల్ట్రీఫాంల వద్ద శానిటేషన్‌కు చర్యలు
- ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెంలో కలకలం
- మూడు రోజుల్లో 13 వేల కోళ్లు మృతి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందకుండా అధికారులు చర్యలు చేపట్టారు. బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయ్యాక ఉభయగోదావరి జిల్లాల నుంచి కృష్ణాజిల్లాకు కోళ్లు, కోడిగుడ్లు రాకుండా సరిహద్దుల వద్ద పశుసంవర్థక, పోలీస్ విభాగాల అధికారులు నిఘాను పటిష్టం చేశారు. అన్ని ప్రాంతాల్లోని పౌల్ట్రీఫాంల వద్ద పశుసంవర్థక శాఖ సిబ్బందిని అందుబాటులో ఉంచి ఎక్కడైనా కోళ్లు అధిక సంఖ్యలో చనిపోతున్నాయా అనే అంశంపై ఆరా తీస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరాను నిలిపివేశారు. అవనిగడ్డ మండలం పులిగడ్డ, కృత్తివెన్ను మండలం పల్లెపాలెం, కానూరు, పెదపారుపూడి, వడ్లమన్నాడు తదితర ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి కోళ్లు, కోడిగుడ్లను రవాణా చేసే వాహనాలు రాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే పౌల్ట్రీఫాం యజమానులు కోళ్లకు వ్యాధులు వ్యాపించకుండా శానిటేషన్ చర్యలతో పాటు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాగా, గంపలగూడెంలో మండలం మూడు రోజుల వ్యవధిలో 13 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో ఏపీ-తెలంగాణ సరిహద్దు నుంచి ఎన్టీఆర్ జిల్లాలోకి కోళ్ల రవాణాను నిలిపివేశారు. అయితే, ఇది మిగతా 6లో..

ఫిర్యాదుల్లో అగ్రస్థానం

సీఎంవో ఫిర్యాదుల్లో ఎన్టీఆర్ జిల్లాకు రెండో స్థానం

- సీఎంవో గ్రీవెన్స్‌కు మొదటిస్థానం
- 12వ స్థానంలో నిలిచిన కృష్ణాజిల్లా
- రెవెన్యూ తప్పులు, మ్యూటేషన్, భూవివాదాలే అధికం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ముఖ్యమంత్రి కార్యాలయానికి వస్తున్న ప్రజా ఫిర్యాదుల్లో ఎన్టీఆర్ జిల్లా రెండోస్థానంలో నిలిచింది. సెక్రటేరియట్/హెచ్‌వోడీ కార్యాలయాల పరిధిలో వచ్చే సీఎంవో గ్రీవెన్స్ మొదటి స్థానంలో నిలిచింది. ఇక జిల్లాల పరంగా ఎన్టీఆర్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 2024, జూన్ 15 నుంచి 2025, ఫిబ్రవరి 6 వరకు ఎన్టీఆర్ జిల్లా నుంచి మొత్తం 2008 ఫిర్యాదులు అందాయి. ఇక కృష్ణాజిల్లా 12వ స్థానంలో ఉంది. కృష్ణాజిల్లా నుంచి 592 ఫిర్యాదులు అందాయి. ముఖ్యమంత్రి కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదుల్లో ఎక్కువగా రెవెన్యూ అర్జీలు ఉండగా, ఆ తర్వాత స్థానంలో ప్రకృతి విపత్తులు, భూ వివాదాలు, రెవెన్యూ, పోలీసు ఫిర్యాదులు ఉంటున్నాయి. ఆగస్టులో సంభవించిన బుడమేరు వరదల కారణంగా విపత్తు సాయం కింద ఎక్కువ దరఖాస్తులు అందినట్టుగా తెలుస్తోంది. వీటితో పాటు భూ వివాదాలు, పోలీసు సహాయం కోసం ఫిర్యాదులు వచ్చినట్టుగా సమాచారం. జిల్లాలవారీగా సాధారణ గ్రీవెన్స్ విషయానికొస్తే.. పైన చెప్పుకొన్న తేదీల ప్రకారం ఎన్టీఆర్ జిల్లాలో 24,795 అర్జీలు వచ్చాయి. మొత్తం రాష్ట్రవ్యాప్తంగా అర్జీల సంఖ్యాపరంగా ఎన్టీఆర్ జిల్లా 12వ స్థానంలో ఉంది. కృష్ణాజిల్లా 17,310 అర్జీలతో 24వ స్థానంలో ఉంది. రెండు జిల్లాల్లో సాధారణ గ్రీవెన్స్‌లో ముఖ్యంగా రెవెన్యూ తప్పులు, సర్వే సెటిల్‌మెంట్, భూ వివాదాలు, మ్యూటేషన్ల అర్జీలే ఎక్కువ ఉంటున్నాయి.

ఆదాయం కోసం ఆరాటం..!

ప్రమాదకరంగా ఎగ్జిబిషన్ల నిర్వహణ

అనుమతులు లేకపోయినా ఇష్టానుసారంగా..

● ఏడాది కిందట భవానీపురంలోని బబ్బూరి గ్రౌండ్స్‌లో ఓ ఎగ్జిబిషన్ జరిగింది. కృష్ణలంకకు చెందిన యువకుడు ఆ ఎగ్జిబిషన్‌కు వెళ్లి జైంట్‌వీల్ ఎక్కాడు. దానికి సమీపంలో ఎలాంటి రక్షణ లేకుండా విద్యుత్ తీగను వదిలేశారు. దీన్ని ఆ యువకుడు తాకడంతో అక్కడికక్కడే చనిపోయాడు.

● ప్రస్తుతం విద్యాధరపురంలోని గ్రౌండ్‌లో కశ్మీర్ జలకన్యల ఎగ్జిబిషన్ జరుగుతోంది. దీనికి అనుమతి గడువు ముగిసింది. ఆ తర్వాత పొడిగించలేదు కూడా. అయినా ఎగ్జిబిషన్ మాత్రం నడుపుతున్నారు. ఓ షాపులో రేగిన మంటలు ఎగ్జిబిషన్‌లో సగభాగాన్ని చుట్టేశాయి. స్టాళ్లు, ఆటపరికరాలు సహా సర్వం అగ్నికి ఆహుతయ్యాయి.

● ఇదే ఎగ్జిబిషన్‌లో కొద్దిరోజుల కిందట మరో ఘటన జరిగిందని తెలుస్తోంది. జైంట్‌వీల్ నుంచి పడి ఓ యువకుడు మరణించినట్టు ప్రచారం జరుగుతుండగా, పోలీసులు మాత్రం ధ్రువీకరించడం లేదు.

- బెజవాడ జలకన్య ఎగ్జిబిషన్ పరిస్థితి ఇదే..
- జనవరి నెలాఖరుకే ముగిసిన గడువు
- తర్వాత అనుమతి ఇవ్వలేదన్న వీఎంసీ అధికారులు
- పోలీసుల నుంచి మాత్రం అనుమతి ఓకే..
- గ్యాస్ సిలిండర్లు పేలి 20 షాపులు దహనం
- రూ.10 లక్షల వరకూ ఆస్తినష్టం

..ఎగ్జిబిషన్లపై లక్షలాది రూపాయల ఆదాయాన్ని రుచిమరిగిన నిర్వాహకులు భద్రతను గాలికొదిలేస్తున్నారు. లోపభూయిష్టంగా ఏర్పాట్లు చేసి షాపులను అద్దెలకిస్తున్నారు. ఇరుకిరుకు ప్రదేశాల్లో షాపులు ఏర్పాటు చేస్తున్నారు. అగ్నిప్రమాద ముందుస్తు ఏర్పాట్లను పైపైనే చేసుకుంటున్నారు. అనుమతులు ఇవ్వాల్సిన శాఖల మధ్య సమన్వయలోపంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. విద్యాధరపురంలోని కశ్మీర్ జలకన్య ఎగ్జిబిషన్‌లో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో అధికారులు, నిర్వాహకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది.




అస్తవ్యస్తంగా ఎగ్జిబిషన్ ప్రాంగణం (ఇన్‌సెట్‌లో) మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సాధారణంగా వేసవి, దసరా, సంక్రాంతి సెలవుల సమయంలో నగరంలో ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేస్తుంటారు. కొంతమంది నిర్వాహకులు ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన ఖాళీ స్థలాలను అద్దెకు తీసుకుని వీటిని ఏర్పాటు చేస్తారు. మరికొంతమంది ప్రభుత్వ శాఖలకు చెందిన ఖాళీ స్థలాల్లో నిర్వహిస్తారు. నగరంలో ఎక్కువగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఖాళీ స్థలాలు ఉన్నాయి. వాటిలో ఎగ్జిబిషన్లను నిర్వహించడానికి నగరపాలక సంస్థకు దరఖాస్తులు చేసుకుంటారు. ఖజానాకు ఆదాయం చేకూరుతుందన్న ఆలోచనలో వీఎంసీ ఈ స్థలాలను అద్దెకిస్తుంది. ఈ స్థలాల్లో ఎగ్జిబిషన్ నిర్వహించాలంటే ముందుగా అందులోని ఎస్టేట్ విభాగానికి దరఖాస్తు చేసుకోవాలి. దీంతో పాటు వీఎంసీకి అగ్నిమాపక శాఖ మిగతా 6లో..

ప్రమాదం జరిగింది ఇలా..

బుధవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో కశ్మీర్ జలకన్య ఎగ్జిబిషన్‌లో ఓ స్టాల్‌లో సిబ్బంది వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పేలింది. ఆ గ్యాస్ సిలిండర్ భాగాలు భారీ శబ్దాలతో ఎదురుగా ఉన్న స్టాళ్లలో పడ్డాయి. ఆ స్టాల్‌లో ఉన్న సిలిండర్లు కూడా పేలటంతో ఇరువైపులా ఉన్న స్టాళ్లకు మంటలు అంటుకున్నాయి. దట్టంగా పొగలు వ్యాపించడంతో పాటు మంటలు ఎగసిపడ్డాయి. ఫైర్ అధికారులు, సిబ్బంది నాలుగు అగ్నిమాపక వాహనాలతో ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అప్పటికే సుమారు 20 దుకాణాలకు మంటలు అంటుకున్నాయి. సుమారు రెండున్నర గంటల పాటు కష్టపడి మంటలు ఆర్పారు. ఈ ఘటనలో సుమారు 20 స్టాళ్లు పూర్తిగా కాలిపోయాయని, రూ.10 లక్షల వరకు నష్టం జరిగి ఉండవచ్చని భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.



ఇసుక గుట్టు తేల్చండి

- రుద్రవరంలో భారీగా నిల్వలు
- అధికారులకు ఫిర్యాదుతో వెలుగులోకి..
- కాంట్రాక్టు పనుల కోసమేనంటున్న నిర్మాణ సంస్థ
- విచారణ చేస్తే బయటపడనున్న నిజాలు

6లో



వేసవిలో నీటి సంక్షోభం..!

- పూర్తికాని ఆకుమర్రు మంచినీటి పథకం ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులు
- రూ.2.40 కోట్ల నిధులు విడుదలైనా పనులు శూన్యం
- టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు రాలేదన్న సాకుతో పనులు నిలుపుదల
- మచిలీపట్నం మండలంలోని 108 ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం

8లో

మిర్చి రైతు విలవిల!





నల్లి దాడితో కకావికలమైన మిర్చి పంట, కల్లంలో ఆరబోసిన మిరపకాయలు

ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో మిర్చి రైతును నల్లి కోలుకోలేని దెబ్బతీసింది.. దిగుబడి లేకపోగా పెట్టిన పెట్టుబడి కూడా రాలేని దుస్థితి.. మిర్చి రైతు పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయి విలవిల్లాడుతున్నారు. మార్కెట్ పరిస్థితి చూస్తే ఘోరంగా తయారైంది. కనీసం బయటపడటానికి కూడా తగిన ధర లభించటం లేదు. ఆరుగాలం కష్టపడి పంట పండించినా.. రెక్కల కష్టం తప్పితే లాభసాటి లేని పరిస్థితి. ప్రభుత్వం ఆదుకోవాలని మిర్చి రైతులు అభ్యర్థిస్తున్నారు.

- నల్లి తెగులుతో దిగుబడి ధమాల్
- మార్కెట్ పరిస్థితి చూస్తే దారుణం
- కనీస పెట్టుబడి కూడా రాని పరిస్థితి
- ఎన్టీఆర్ జిల్లాలో మిర్చి రైతు కడగండ్లు

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

మిర్చి రైతు పరిస్థితి కడుదయనీయంగా తయారైంది. చీడపీడల దెబ్బకు ఎన్టీఆర్ జిల్లాలో మిరప తోటలు కకావికలమయ్యాయి. దిగుబడి సగానికి సగం తగ్గిపోయింది. లేత తోటల్లో అయితే ఎకరానికి పది క్వింటాళ్లు రావటమే గగనమవుతోంది. మార్కెట్ కూడా గట్టి దెబ్బకొట్టింది. గతేడాది తాలు (తెల్ల) కాయలకు లభించిన ధర కూడా ప్రస్తుతం నాణ్యమైన ఎర్రకాయలకు పలకటం లేదు. కోత కూలి కూడా రావటం లేదంటే మార్కెట్ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దిగుబడి రాక, ధర లేక పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిన మిర్చి రైతులు కన్నీళ్లు పెడుతున్నారు.

● ఈ ఏడాది ఎన్టీఆర్ జిల్లాలో 30 ఎకరాల్లో రైతులు మిర్చి తోటలు సాగుచేశారు. ముఖ్యంగా పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలు మిర్చి తోటలకు ప్రసిద్ధి. ఇక్కడ ఎకరం కౌలు రూ.30 వేల నుంచి రూ. 40 వేలుగా ఉంది. ఒక్కొక్క మొక్క రూ. 1.50ల వంతున కొని, ఎకరానికి 15 వేల మొక్కలు నాటారు. వ్యవసాయం, ఎరువులు, పురుగు మందులు, నీటి తడులు ఇతరత్రా ఖర్చులు కలిపి ఎకరాకు రెండు లక్షలకు పైగా పెట్టుబడి అయింది. కోత కూలి, గ్రేడింగ్‌తో కలిపి క్వింటాకు రూ. ఐదువేల నుంచి రూ. ఆరువేలు అవుతోంది.

● ఆగస్టు చివర్లో, సెప్టెంబరు మొదట్లో కురిసిన భారీ వర్షాలకు, వరదలకు పల్లపు, లోతట్టు, వాగుల వెంబడి సాగు చేసిన తోటలు దెబ్బతిన్నాయి. మరల రైతులు ఎంతో ఆశతో తోటలు సాగుచేశారు. నవంబరు నెలవరకు తోటలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇక ఆ తర్వాత ఎర్రనల్లి, నల్లనల్లి దాడి చేశాయి. పురుగు మందులు ఒకటికి నాలుగు సార్లు పిచికారి చేసినప్పటికీ నల్లి అదుపులోకి రాలేదు. నల్లి ఉధృతంగా దాడి చేయటంతో రోజుల వ్యవధిలోనే తోటలు కకావికలమయ్యాయి. పూత రాలిపోయింది. ఆకులు, పిందెలు నల్లగా మాడిపోయాయి. చిగుళ్లు సైతం వాడిపోవటంతో మిరప మొక్కలు గిడసబారి, జీవచ్ఛవాల్లా తయారయ్యాయి. వేరుకుళ్లు సోకినట్టుగా తోటలు ఎర్రబడి నిలువునా ఎండిపోతున్నాయి. దీంతో తోటల్లో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ముదురు తోటల్లో అయితే ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల లోపు దిగుబడి వస్తుండగా, లేత తోటల్లో ఐదు నుంచి పది క్వింటాళ్ల లోపు దిగుబడి మాత్రమే వస్తోంది. ఇప్పటికే ముప్పావు వంతుకు పైగా కోత పూర్తయింది. కోయాల్సింది కేవలం పావు వంతు లోపు మాత్రమే ఉంటుంది.

● ఆశించిన దిగుబడులు లేక తీవ్ర నిరుత్సాహంతో కొట్టుమిట్టాడుతున్న రైతులను మార్కెట్ చావు దెబ్బకొట్టింది. ప్రస్తుతం పలుకుతున్న ధరలు చూస్తుంటే నిలువునా మిర్చి రైతుల ఉసురు తీసేట్టుగా ఉన్నాయి. కొంతమంది వ్యాపారులు కల్లాల్లోకి వచ్చి మిర్చి కొంటున్నారు. తేజ రకానికి క్వింటా రూ. 8 వేల నుంచి రూ. 13 వేల లోపు ధర ఇస్తున్నారు. లావు రకాలకు రూ. ఎనిమిది వేలనుంచి రూ. 10 వేలలోపు, మధ్యస్థ రకాలకు అయితే రూ. పదివేల నుంచి రూ. 11 వేల లోపు ధర పలుకుతున్నది. గత ఏడాది తాలు (తెల్ల) కాయలకు వచ్చిన ధర కూడా ఇప్పుడు ఎర్ర కాయలకు రావటం లేదు. అప్పట్లో తెల్లకాయలకు రూ. పది వేల నుంచి రూ. 13 వేలు ధర పలికింది. నాణ్యత కల్గిన ఎర్ర కాయలకు ఈ ధర రావటం గగనమవుతోంది. అయితే ప్రస్తుతం తెల్లకాయలకు నామమాత్రపు ధర వస్తున్నది. వ్యాపారులు క్వింటా రూ. మూడు వేల నుంచి రూ. నాలుగు వేల లోపు కొంటున్నారు. ఈ ధరలకు కూడా మార్కెట్లో చురుకుగా కొనుగోళ్లు జరగటం లేదు. ప్రస్తుతం ధర చాలా తక్కువగా ఉండటంతో మున్ముందు ధర పెరుగుతుందన్న ఆశతో కొంతమంది చిన్న వ్యాపారులు కాయలు కొని శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు.

● మిర్చి ఘాటుకు రైతులు విలవిల్లాడుతూ కంటతడి పెడుతున్నారు. 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చినప్పటికీ గిట్టుబాటు ధర లభించనందున రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. కొంతమంది రైతులకు అయితే కోత కూలి రావటమే కష్టమవుతుందని అంటున్నారు. ఏమైనా ఈ ఏడాది ఊహించని విధంగా లక్షల్లో నష్టాలను మూటగట్టుకోవాల్సి వచ్చిందని మిర్చి రైతులు వాపోతున్నారు. ఈనేపథ్యంలో జగ్గయ్యపేట నియోజకవర్గంలో దెబ్బతిన్న మిర్చితోటలను ఇటీవల ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పరిశీలించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సాయమందించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీఇచ్చారు.

గిట్టుబాటు ధర లేదు

- కొమ్మినేని నరసింహారావు, రైతు



పదమూడు ఎకరాల్లో మిర్చి వేయగా, సగటున 15 క్వింటాళ్ల వంతున దిగుబడి వస్తుంది. మార్కెట్లో నెలకొన్న సంక్షోభం వల్ల గిట్టుబాటు ధర లభించటం లేదు. పరిస్థితి దారుణంగా ఉంది. గత ఏడాది పంట ఇంకా శీతల గిడ్డంగిలో ఉంది. గత్యంతరం లేక క్వింటా రూ. 11 వేలకు అమ్మాను. ఎకరానికి రూ. రెండు లక్షలకు పైగా పెట్టుబడి అయింది. నష్టం రూ. ఎనిమిది లక్షలకు పైగా ఉంటుంది. ఏం చేయాలో అర్థం కావటం లేదు.

నల్లి నిలువునా ముంచేసింది

- పద్మాల శ్రీనివాసరావు, రైతు



ఎంతో ఆశతో ఎనిమిది ఎకరాల్లో మిర్చి సాగుచేశాను. మొదట్లో బొబ్బర తెగులు సోకినప్పటికీ అదుపులోకి వచ్చింది. డిసెంబరు నెలలో నల్లి ఉధృతంగా దాడి చేయటంతో తోటలు నిలువునా దెబ్బతిన్నాయి. కోతలు పూర్తి కాలేదు. పది క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. ఎకరానికి రూ. లక్షకు పైగా నష్టం వస్తుంది. మిర్చి రైతులను ప్రభుత్వం స్పందించి ఉదారంగా ఆదుకోవాలి.

గురుకులాల్లో ప్రవేశాలకు

దరఖాస్తులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లాల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతి (ఇంగ్లీషు మాధ్యమం), ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, ఐఐటీ మెడికల్ కోచింగ్ సెంటర్లలో ప్రవేశానికి బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లాల సమన్వయ అధికారి ఎ.మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, ఐఐటీ మెడికల్ కోచింగ్ సెంటర్లకు సంబంధించి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్://ఏపీబ్రాగ్‌సెట్ ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలి. దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 6 అని, వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన తెలిపారు. ఇతర వివరాల కోసం జిల్లాల్లోని గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

ప్రవేశ పరీక్ష తేదీ

ఏప్రిల్ 6 - 5వ తరగతి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
ఏప్రిల్ 6వ తేదీ - జూనియర్ ఇంటర్మీడియట్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు
ఏప్రిల్ 20వ తేదీ - ఐఐటీ మెడికల్ కోచింగ్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.



రుద్రవరంలో నిల్వ ఉంచిన ఇసుక గుట్ట

ఇసుక గుట్టు తేల్చండి

- రుద్రవరంలో భారీగా నిల్వలు!
- అధికారులకు ఫిర్యాదుతో వెలుగులోకి..
- కాంట్రాక్టు పనుల కోసమే అంటున్న నిర్మాణ సంస్థ

మచిలీపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మండలం రుద్రవరంలో పెద్దఎత్తున ఇసుకను నిల్వచేసిన అంశంపై స్థానికంగా వివాదం చెలరేగింది. ఈఅంశంపై విజిలెన్స్, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఘంటసాలకు చెందిన రమేష్ మండలంలోని శ్రీకాకుళం ఇసుక రీచ్ నుంచి ఇసుకను రుద్రవరానికి అక్రమంగా తరలించి విక్రయిస్తున్నారని బుధవారం అధికారులకు ఫిర్యాదు చేశాడు. మచిలీపట్నంకు చెందిన మనోహర్ ఇసుక నిల్వ చేసిన ప్రాంతానికి వెళ్లి తనకు రెండు టిప్పర్ల ఇసుక కావాలని అడిగాడు. ఒక టిప్పరులో 28.700టన్నుల ఇసుక లోడ్‌చేసి కాటావేసి కాలేఖాన్‌పేటలో మునిసిపల్ పాఠశాల సమీపంలో వేశారు. ఇసుక ధరలో తేడాలు రావడంతో ఇసుక విక్రయించిన రమేష్‌కు, కొనుగోలుదారు మనోహర్ మధ్య వాగ్వివాదం జరిగి అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ అంశం వెలుగులోకి వచ్చింది. అయితే విశాఖపట్నంకు చెందిన సుచరితకాంట్రాక్టు సంస్థకు కృష్ణాయూనివర్సిటీలో భవన నిర్మాణాల కాంట్రాక్టు వచ్చిందని, ఆ పనుల నిమిత్తం ఇక్కడ ఇసుకను నిల్వచేసినట్టు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. గతంలో రుద్రవరంలోని టిడ్కో గృహాలను తమ కంపెనీ నిర్మించిందని, ప్రస్తుతం ఇసుక నిల్వ ఉంచిన ప్రాంతంలో అప్పట్లో మిక్సింగ్‌ప్లాంట్‌ను ఏర్పాటుచేశామని, ఇంకా టిడ్కో గృహాలకు తుదిదశలో పనులు కొనసాగుతున్నాయని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. వ్యవహారంపై అధికారులు విచారణ చేస్తే ఇసుకనిల్వల గుట్టు వెలుగుచూసే అవకాశం ఉంది.

పట్టువస్త్రాల్లోనూ పట్టుబడ్డారు!

(5వ పేజీ తరువాయి)

నాణ్యతగా ఉన్నాయా లేవా అని పరిశీలించారు. జూనియర్ గుమాస్తా కె.శ్రీనివాసరెడ్డి వద్ద టెండర్‌దారులు మొదట్లో సమర్పించిన వస్త్రాల శాంపిళ్లను, గోడౌన్‌లో ఉన్న వస్త్రాలను పోల్చి చూడగా భారీ వ్యత్యాసం కనిపించింది. గుమాస్తా దగ్గర ఉన్న శాంపిల్ ఒకటైతే, టెండర్‌దారులు సరఫరా చేసిన చీరలు మరోలా ఉన్నాయి. విచారణ చేయగా ధరల్లో కూడా వ్యత్యాసం కనిపించింది. చీరల వెరిఫికేషన్ నిమిత్తం నియమించిన కమిటీ కూడా ఇదే నివేదిక ఇచ్చింది. దీని ప్రకారం రూ.5,900 ధర కలిగిన ధోవతి స్థానే కేవలం రూ.450 నుంచి రూ.600 విలువైన వస్త్రాలనే సరఫరా చేశారు. రూ.6 వేల విలువైన వస్త్రం స్థానే కేవలం రూ.1,000 చీర సరఫరా చేశారు. దీంతో దేవస్థానం అధికారులు.. జూనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరెడ్డిపై చర్యలకు ఆదేశించారు. పలు సెక్షన్ల కింద క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని నోటీసు ఇచ్చారు. ఏడు రోజుల్లోపు సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. అప్పటివరకు హెడ్ క్వార్టర్ విడిచి వెళ్లరాదని పేర్కొంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వస్త్రసేవ కార్యక్రమంలో భక్తులు ఇచ్చిన చీరలను సరిగ్గా జమ చేయకుండా ఉండటంతో పాటు చీరల సంఖ్యలో కూడా తేడా రావటంతో ఈ సస్పెన్షన్ వేటు వేశారు. ప్రాథమికంగా రుజువులు దొరకటంతో అతనిపై చర్యలకు ఈవో ఆదేశాలు జారీ చేశారు. విధులను సీనియర్ అసిస్టెంట్ పి.శిరీషకు అప్పగించారు.

ఏమార్చారు..!

(5వ పేజీ తరువాయి)

మూస్ కండక్టర్ డబుల్ సర్క్యూట్ లైన్లను వేశారు. 2020 నుంచి ఈ సెక్షన్‌లో లోడ్ పెరిగిపోవటంతో లైన్లను దానికి అనుగుణంగా మార్చాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఏసీఎస్ఎస్ మూస్ డబుల్ సర్క్యూట్ లైన్లను వేసే పని ప్రారంభించారు. ఈ మార్గంలో ఆరు వైర్లను మార్చారు. పూర్తిగా కొత్త లైన్లను మార్చుతుండగా, కేవలం మరమ్మతులంటూ ట్రాన్స్‌కో ప్రకటన చేయడం గమనార్హం. డబుల్ కెపాసిటీ కలిగిన విద్యుత్ లైన్లను పూర్తిగా మార్చే క్రమంలో ట్రాన్స్‌కోనే భారీగా లబ్ధి పొందుతోంది.

రైతులను మోసం చేసిన ట్రాన్స్‌కో

నున్న-గుడివాడ 220 కేవీ సెక్షన్‌లో కొత్త విద్యుత్ లైన్లను మార్చే క్రమంలో ట్రాన్స్‌కో అధికారులు కారిడార్ కాంపన్సేషన్ ఎగవేతకు పాల్పడ్డారు. 2024, జూన్‌లో కేంద్ర ప్రభుత్వం విద్యుత్ లైన్ల మార్పిడికి సంబంధించి సరికొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. వీటి ప్రకారం.. ప్రస్తుత ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ విద్యుత్ లైన్లను మార్చి కొత్తవి వేస్తే రైతుకు చెందిన భూమి ఎకరం మార్కెట్ విలువకు 30 శాతం మేర పరిహారం చెల్లించాలి. ఈ విషయంపై రైతులకు అవగాహన లేకపోవటంతో మరమ్మతుల పేరు చెప్పి లైన్లను మార్చేశారు.

సింధు స్నానాలకు పోటెత్తిన భక్తజనం

- పుణ్యస్నానాలు ఆచరించిన 30 వేలమంది
- ట్రాఫిక్ అంతరాయంతో ఇక్కట్లు



హంసలదీవి వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కోడూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సింధు స్నానాలు ఆచరించేందుకు హంసలదీవికి భక్తులు భారీ సంఖ్యలో రావటంతో సాగర తీరం పోటెత్తింది. బుధవారం మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా హంసలదీవి సమీపంలో సాగర తీరం వద్దకు తెలుగు రాష్ట్రాల్లోని నలుమూలల నుంచి 30 వేలమంది వరకు భక్తులు తరలి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. హంసలదీవి నుంచి పాలకాయితిప్ప వరకు మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సముద్రతీరం వద్ద భక్తుల రక్షణ కోసం ఐదు మరబోట్లు, 30 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. రెండు వైద్యశిబిరాలు, నాలుగు తాత్కాలిక మరుగుదొడ్లు, మంచినీటి వసతిని ఏర్పాటు చేశారు. సముద్ర తీర ప్రాంతంలో గ్రామపంచాయతీ వారు 150 మంది శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. అవనిగడ్డ నుంచి హంసలదీవికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు వేశారు. మెరైన్, పోలీసు, ఫారెస్ట్ శాఖ తరఫున 250 మంది సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ప్రదేశాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచినట్టు అవనిగడ్డ సీఐ యువకుమార్ తెలిపారు. హంసలదీవి కృష్ణా పవిత్ర సంగమ ప్రదేశంలో స్నానాలు ఆచరించేందుకు భక్తులకు అధికారులు అనుమతించకపోవటంతో భక్తులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పవిత్ర సంగమ ప్రదేశంలో పుణ్యస్నానాలు ఆచరిస్తే పాపవిమోచనం కలుగుతుందని, ఇతర రాష్ట్రాల నుంచి హంసలదీవికి వచ్చామని, కానీ ఇక్కడ అధికారులు భద్రత దృష్ట్యా అనుమతించటం లేదని భక్తులు అసహనం వ్యక్తం చేశారు. హంసలదీవి గ్రామంలో డీసీ వైస్ చైర్మన్ బచ్చు వెంకటనాగ్ ప్రసాద్ ఆధ్వర్యంలో రెండు వేలమందికి మజ్జిగ పంపిణీ చేశారు. గ్రామంలోని శివాలయం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 5 వేలమందికి అన్నసమారాధన నిర్వహించారు. సింధు స్నానాల నేపథ్యంలో అవనిగడ్డ ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ తదితరులు పుణ్యస్నానాలు ఆచరించి వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు.

నిర్మానుష్యంగా పవిత్ర సంగమ ప్రదేశం

కోడూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో ఒక్కసారి అయినా కృష్ణా సాగర సంగమ క్షేత్రంలో పుణ్యస్నానం ఆచరిస్తే సర్వ పాపాలు తొలుగుతాయని స్కంద పురాణంలో పేర్కొన్నారు. అంతటి ప్రసిద్ధిగాంచిన కృష్ణా



సాగర సంగమ క్షేత్రంలో పుణ్యస్నానం ఆచరించేందుకు విచ్చేసిన భక్తకోటి ఆకాంక్షను అధికారులు పట్టించుకోకుండా సంగమ ప్రదేశానికి వెళ్లకుండా ఆంక్షలు విధించటంతో సంగమ ప్రదేశం నిర్మానుష్యంగా మారింది.

సంగమ విశిష్టత

పాత తుల్యమైన గంగానది సైతం తన పాప పంకిలాన్ని తొలగించేందుకు కాకి రూపం దాల్చి వివిధ పుణ్య నదుల్లో స్నానమాచరిస్తూ హంసలదీవి క్షేత్రంలోని సాగర సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించగానే హంసగా మారిందని, అందుకే ఈ ప్రాంతానికి హంసలదీవిగా పేరు వచ్చిందని చరిత్ర.



మంగినపూడి బీచ్‌లో..

మచిలీపట్నం టౌన్ : మాఘపౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్‌లో బుధవారం పెద్దసంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సముద్రుడికి అర్ఘ్యం ఇచ్చారు. గుమ్మడికాయలతో అర్చనలు నిర్వహించారు. బీచ్‌లో పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో తప్పిపోయిన పిల్లలను మెరైన్ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతపురం నుంచి బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు పుణ్యస్నానం చేశారు. దత్తరామేశ్వరంలో ద్వాదశ బావుల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. నగరేశ్వరుని సందర్శించారు.



సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లను కలిసిన ఎంపీ కేశినేని శివనాథ్ వివిధ కంపెనీల ప్రతినిధులు



చంద్రబాబు, లోకేశ్‌లను కలిసిన ఎంపీ, పారిశ్రామిక వేత్తలు

వన్‌టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని ప్రాంతంలో స్పోర్ట్స్ సిటీకి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా, ఐటీ మంత్రి నారా లోకేశ్‌లను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, శాప్ చైర్మన్ రవినాయుడుతో కలిసి బుధవారం ఉండవల్లిలోని వారి నివాసంలో కలిశారు. పాపులస్ గ్లోబల్ ఆర్కిటెక్స్ ప్రతినిధి సిద్ధార్థ్, ఎన్.వి.ఆర్కిటెక్స్ ప్రతినిధి వెంకట్, ఐబీఎస్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టేషన్స్ కంపెనీ ఎండీ వడ్లమూడి హర్ష సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను కలిశారు.

నిష్పక్షపాతంగా పోలింగ్ నిర్వహించాలి

- కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిష్పక్షపాతంగా పోలింగ్ నిర్వహించాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. బుధవారం జడ్పీ కన్వెన్షన్ హాలులో రెవెన్యూ డివిజన్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులుపోలింగ్ అధికారులు, సెక్టార్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, తహసీల్దార్లకు జరిగిన శిక్షణా తరగతులలో కలెక్టర్ మాట్లాడారు. 27న జిల్లాలో 77 పోలింగ్ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరుగుతోందన్నారు. బాలెట్ పేపరు ద్వారా ఎన్నిక జరుగుతోందన్నారు. ఈవీఎంలతో నిర్వహించే ఎన్నికకు, బాలెట్ పేపరు ద్వారా జరిగే ఎన్నికకు గల వ్యత్యాసాన్ని కలెక్టరు వివరించారు.

మ్యుటేషన్ స్కాంలో రెండో విడత విచారణ

గుడివాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన 143 మ్యూటేషన్‌ల విషయంలో కోట్లాది రూపాయలు మున్సిపాల్టీకి జమచేయకుండా కొందరు ఉద్యోగులు తమ జేబుల్లోకి మళ్లించినట్టు నిర్ధారణ కావడంతో మున్సిపల్ ఆర్డీ ఆదేశాలతో విచారణాధికారి తాడిగడప కమిషనర్ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. బాధితులను గత నెల 28న విచారణకు పిలిపించగా 62మంది హాజరయ్యారు. అప్పుడు హాజరు కాని బాధితులను బుధవారం మరోమారు పిలిచారు. మున్సిపల్ ఉద్యోగులు జూనియర్ అసిస్టెంట్ జీకే కిషోర్, రికార్డు అసిస్టెంట్ అడపా రవికిషోర్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పి.అనీల్ కుమార్, కె.సురేంద్ర, ఎ.ఫణికుమార్‌లను విచారణాధికారి భవానీ ప్రసాద్ బుధవారం విచారించారు. మ్యుటేషన్ స్కాం వ్యవహారంలో ఆర్డీ సత్యనారాయణ ఆదేశాల మేరకు విచారణ చేసానని, దర్యాప్తులో భాగంగా నివేదికను అందజేస్తానని విచారణాధికారి భవానీ ప్రసాద్ తెలిపారు.

బర్డ్‌ఫ్లూ కలవరం

(5వ పేజీ తరువాయి)

బర్డ్ ఫ్లూనా, మరేదైనానా అని తెలుసుకునేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు శాంపిళ్లను సేకరించి భోపాల్‌కు పంపారు. ఘటన జరిగిన ఫారానికి కిలోమీటర్ వరకు రెడ్‌జోన్, 9 కిలోమీటర్ల వరకు ఎఫిక్ జోన్ ప్రకటించారు.

బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలివీ..

బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందకుండా పశుసంవర్ధకశాఖ జేడీ ఎన్‌సీహెచ్ నరసింహులు కొన్ని సూచనలు చేశారు. కోళ్లఫారాల వద్ద కనీస పారిశుధ్య చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. బయటి వ్యక్తులను, వాహనాలను ఫాంలోకి అనుమతించకూడదన్నారు. కోళ్లకు వ్యాక్సిన్ వేయించడంతో పాటు కోళ్లు బలహీనంగా ఉంటే ఎలక్ట్రోలైట్స్ వంటి అదనపు విటమిన్లు అందించాలని చెప్పారు. మేతకు ఉపయోగించే దాణాలో టన్నుకు 8 కిలోల వెల్లుల్లిని కలపాలని సూచించారు. టన్ను దాణాలో ఐదు కిలోల బెల్లాన్ని కలిపి అందించడంతో పాటు గుమ్మడికాయను ప్రతి కోడికి కనీసం 5 గ్రాముల మేర అందేలా దాణాలో కలపాలని ఆయన సూచించారు. కోళ్ల ఆరోగ్య పరిస్థితులను అంచనా వేసి వైద్యుల సూచనల మేరకు మందులను వినియోగించాలని ఆయన తెలిపారు.

ఆదాయం కోసం ఆరాటం..!

(5వ పేజీ తరువాయి)

నుంచి అనుమతి తీసుకోవాలి. ఈ రెండు అనుమతులు తీసుకున్నాక పోలీసు శాఖ అనుమతి తీసుకోవాలి. ప్రైవేట్ స్థలంలో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినా, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన స్థలాల్లో నిర్వహించినా ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలి. విద్యాధరపురంలోని కార్మికశాఖకు చెందిన స్థలంలో ప్రభాకర్ అనే వ్యక్తి కశ్మీర్ జలకన్య ఎగ్జిబిషన్‌ను జనవరిలో ఏర్పాటు చేశాడు. మూడు నెలల పాటు అద్దెకు తీసుకున్నాడు. కానీ, జనవరి 2 నుంచి నెలాఖరు వరకు మాత్రమే అనుమతి లభించింది. ఈ ఎగ్జిబిషన్‌లో జైంట్‌వీల్‌తో పాటు వివిధ రకాల వినోద యంత్రాలను ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయగా, మిగిలిన స్థలంలో రేకుల షెడ్లను ఏర్పాటుచేసి దుకాణాలుగా విభజించాడు. మొత్తం 38 దుకాణాలను ఏర్పాటుచేసి వివిధ వ్యాపారులకు అద్దెకిచ్చాడు. ఎగ్జిబిషన్ ముగిసే సమయానికి కనీసం రూ.50 వేలను అద్దెగా వసూలు చేస్తారు. ఇలా ఇక్కడ షాపులు నిర్వహిస్తున్న వారిలో ఉత్తరాదికి చెందినవారున్నారు. ప్రభాకర్ తీసుకున్న అనుమతులు జనవరి నెలాఖరుతోనే ముగిశాయి. అనుమతి పొడిగించాలని దరఖాస్తు చేసుకున్నానని, కార్పొరేషన్‌కు రూ.3.96 లక్షలు చెల్లించానని సదరు నిర్వాహకుడు చెబుతున్నాడు. జనవరి నెలాఖరు తర్వాత తాము అనుమతి ఇవ్వలేదని వీఎంసీ అధికారులు చెబుతున్నారు. తాము ఎన్‌వోసీ మాత్రమే ఇచ్చామని, ప్రైమరీ అనుమతి ఇవ్వలేదని వీఎంసీ ప్రాంతీయ అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు చెప్పారు. ప్రాంగణంలో ఎగ్జిబిషన్‌ను నిర్వహించడానికి వీఎంసీ ఎస్టేట్ విభాగం అనుమతి పొడిగించలేదని చెబుతోంది.



కాలి బూడిదైన ఆట వస్తువులు

పోలీసులు ఎలా ఇచ్చారు?

వీఎంసీ ఇచ్చిన అనుమతి గడువు ముగిసింది. పొడిగింపునకు నిర్వాహకుడు ప్రభాకర్ డబ్బులు చెల్లించినా.. అధికారికంగా ఎలాంటి కాగితాలు ఇవ్వలేదు. ఇది లేకుండానే పోలీసు శాఖ ప్రభాకర్‌కు అనుమతినిచ్చింది. వీఎంసీకి డబ్బు చెల్లించిన రశీదులను చూపించి పోలీసుల నుంచి అనుమతి తీసుకున్నట్టు తెలుస్తోంది. జనవరి నెలాఖరుకే గడువు ముగిసినా పోలీసులు ఈనెల 1 నుంచి 28వ తేదీ వరకు అనుమతి ఇవ్వడం గమనార్హం. డబ్బు చెల్లించుకున్న వీఎంసీ అధికారులు.. ఇప్పటి వరకు నిర్వాహకుడికి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అనుమతిని పొడిగిస్తారా లేదా అనే విషయం కూడా చెప్పలేదు. పొడిగింపు దరఖాస్తులు ఎలాగూ అధికారుల వద్ద ఉండటం, పోలీసులు ఇప్పటికే అనుమతి ఇవ్వడంతో ఎగ్జిబిషన్‌ను నడుపుకోవడానికి ఎలాంటి అడ్డంకులు లేవని భావించాడు. అలాగే, ఎగ్జిబిషన్‌ను సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించాలి. కానీ, రాత్రి 10 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

హోంమంత్రి ఆరా

అగ్నిప్రమాదంపై హోంమంత్రి అనిత స్పందించారు. పశ్చిమ ఏసీపీ దుర్గారావుతో ఫోన్‌లో మాట్లాడారు. గ్యాస్ సిలిండర్ పేలుడుతో మంటలు వ్యాపించాయని మంత్రికి ఏసీపీ వివరించారు. వేసవికాలం మొదలవుతున్నందున ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసు, అగ్నిమాపక అధికారులను ఆదేశించారు. వ్యాపారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

ప్రాణనష్టం జరగలేదు : మున్సిపల్ కమిషనర్

- ముగ్గురు అధికారులకు షోకాజ్

విద్యాధరపురం : అగ్ని ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రమాద స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అగ్నిమాపక శాఖ అధికారుల సమన్వయంతో త్వరగా మంటలను అదుపులోకి తీసుకొచ్చారన్నారు. కాగా వీఎంసీ ఎస్టేట్ ఆఫీసర్, రీజనల్ ఫైర్ ఆఫీసర్, జోనల్ కమిషనర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

వైభవంగా వీరభద్ర పళ్లెం

ఉయ్యూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివార్ల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం వృషభ వాహన సేవ, గ్రామోత్సవం, వీరభద్రపళ్లెం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం నిత్యోపాసన హోమం, బలిహరణాదులు అనంతరం రథోత్సవం జరిపారు. ఈ సందర్భంగా వీరభద్రపళ్లెంతో గ్రామోత్సవం నేత్రపర్వంగా జరిపారు. ఆలయ అర్చకులు వాసు దంపతులు హారతి పళ్లెం కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవతా మూర్తుల వేషధారణతో నృత్యాలు, భక్తిపాటలతో ఊరేగింపు జరిపారు.



దేవతామూర్తుల వేషధారణతో నృత్యాలు

పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలి

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని బాపులపాడు పంచాయతీ కార్యదర్శి పూర్ణేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 2017 నుంచి ఇళ్ల పన్ను, నీటి కుళాయి పన్నులు రూ.4కోట్లు బకాయిలు ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాది పన్నులతో పాటు బకాయిలు కూడా సకాలంలో చెల్లించాలని కోరారు. బకాయిల వసూళ్ల వేగవంతంగా నిర్వహించడానికి సచివాలయ సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు.

పాడిరైతు సంక్షేమాభివృద్ధే ధ్యేయం

కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పాడిరైతు కుటుంబాల సంక్షేమం తో పాటు ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కృష్ణామిల్క్ యూనియన్ కృషి చేస్తున్నదని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కాకులపాడు, దంటగుంట్ల పాల సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం కృష్ణా మిల్క్ యూనియన్ వజ్రోత్సవాల సందర్భంగా రెండు తరాలుగా కృష్ణామిల్క్ యూనియన్‌కు నిరంతరాయంగా పాలు పోస్తున్న 9మంది పాడిరైతులను ఘనంగా సత్కరించారు. పాడిరైతులందరి సహకారంతోనే కృష్ణామిల్క్ యూనియన్ లాభాల బాటలో పయనిస్తూ 60 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. పాలసేకరణలో అత్యధికంగా పాలు పోసిన రైతులకు ఘనంగా సత్కరించారు. తదనంతరం పాడిరైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మాగంటి హరిబాబు, సూపర్‌వైజర్, పాడిరైతులు పాల్గొన్నారు.



పాడిరైతులను సత్కరిస్తున్న కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, మేనేజర్ హరిబాబు

వీరమ్మ తిరునాళ్లలో భక్తుల రద్దీ



అమ్మవారి ఆలయం వద్ద మహిళల పాణాసారం

ఉయ్యూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లలో మాఘపౌర్ణమి పురస్కరించుకుని బుధవారం భక్తుల రద్దీ పెరిగింది. అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకునేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సంతానం లేని మహిళలు తిరునాళ్లలో పౌర్ణమి రోజున అమ్మవారి ఆలయం వద్ద స్నానమాచరించి ఆలయం వద్ద భక్తితో ప్రార్థించిన వారికి అమ్మవారు సంతాన ప్రాప్తి కలుగచేస్తుందన్న నమ్మకంతో పలువురు పాణా సారాలు ఆచరించారు. వేకువజాము నుంచి భక్తులు తరలివచ్చి పాలపొంగళ్లు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

తిరునాళ్లలో భక్తులకు ప్రసాదాల పంపిణీ

వీరమ్మ తిరునాళ్లలో భక్తులకు పలు సంస్థలు, వ్యక్తులు ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. బుధవారం తిరునాళ్లకు వచ్చిన వేలాది మంది భక్తులకు మహాలక్ష్మి గ్యాస్ ఏజెన్సీ అధినేత వెంట్రప్రగడ శేషునారాయణ ఆధ్వర్యంలో చక్రపొంగలి, పులిహోర పంపిణీచేశారు. నాగరాజు, ఆంజనేయులు, ఏజెన్సీ సిబ్బంది సేవలందించారు, ఎంపీడీవో శేషగిరిరావు, మండలపరిషత్ కార్యాలయ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, తాగునీరు పంపిణీ చేశారు. తిరునాళ్ల ముగిసే వరకు ప్రతిరోజు ప్రసాదం, తాగునీరు అందచేస్తామని ఎంపీడీవో తెలిపారు.



మహాలక్ష్మి గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ

భక్తులకు ఇబ్బంది కలిగించొద్దు: సీఐ

వీరమ్మ తిరునాళ్లకు వచ్చిన వారు వాహనాలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేసి భక్తులకు ఇబ్బంది కలిగించవద్దని ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు అన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్నివైపులా పార్కింగ్ సదుపాయం కల్పించామని, సంబంధిత పార్కింగ్‌లోనే వాహనాలు పెట్టుకుని రావాలన్నారు. వల్లూరు వైపు నుంచి వచ్చేవారు శ్రీనివాసా కళాశాల రోడ్డు ప్రారంభంలో ఉన్న ఖాళీ స్థలం, పామర్రు వైపు నుంచి వచ్చేవారు బస్‌స్టాండ్ వద్ద, కాటూరు వైపున మార్కెట్ యార్డులో, రిలయన్స్ స్మార్ట్ వెనుక, విజయవాడ వైపునుంచి వచ్చేవారు అయ్యప్పస్వామి ఆలయం వెనుక ఎస్‌వీఆర్ టైల్స్ పక్క రోడ్డులో వాహనాలు పార్కింగ్ చేయాలని తెలిపారు.

వెటర్నరీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

గన్నవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసరపల్లి ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల విద్యార్థులు స్టైఫండ్ పెంచాలని కోరుతూ చేస్తున్న రిలే దీక్షలకు మంగళవారం రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్, పరుచూరి రాజేంద్ర, కాట్రగడ్డ జోషీలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెటర్నరీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలన్నారు. లాజర్, యుగంధర్, సుభానీ, ప్రభాకర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాఘ పౌర్ణమి దీపోత్సవం

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాపులపాడు శ్రీ భ్రమరాంబిక శ్రీ శైల మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం మాఘ పౌర్ణమి సందర్భంగా దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా ఆధ్వర్యంలో మహిళలు దీపాలను వెలిగించారు. దీపాలను వెలగించడానికి అవసరమైన సామాగ్రిని ఆలయ కమిటీ ఉచితంగా ఏర్పాటు చేసింది. కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు కొల్లి వెంకట్రావు,తమిరి రమేశ్ తదితరులు పర్యవేక్షించారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో సుదర్శన హోమం

స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం మాఘ పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.



విజేతలతో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, ఏవో మధుసూదనరావు

జాతీయ స్థాయి పేపర్ ప్రజెంటేషన్‌లో డెంటల్ విద్యార్థులకు పతకాలు

గన్నవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దంత వైద్య విద్యార్థులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించటం గర్వకారణమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల విద్యార్థులు ఈ నెల 7 నుంచి 9 వరకూ చెన్నైలో జరిగిన జాతీయ 75వ ఇండియన్ డెంటల్ కాన్ఫరెన్స్‌లో సైంటిఫిక్ పేపర్ ప్రజంటేషన్ కేటగిరిలో సత్తాచాటి పతకాలు సాధించిన విద్యార్థుల అభినందన సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రామోజీరావు మాట్లాడుతూ దేశ నలుమూలల నుండి దంత వైద్య విద్యార్థులు పాల్గొన్న కాన్ఫరెన్స్‌లో తమ విద్యార్థులు పేపర్ ప్రజంటేషన్ చేసి పతకాలు సాధించి కళాశాల కీర్తిని వ్యాపింపజేశారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో అన్ని రంగాల్లో పాల్గొని రాణించాలని సూచించారు. ఏవో వై.మధుసూదనరావు, హెచ్‌వోడీలు డాక్టర్ పల్లవి, డాక్టర్ అజయ్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

15 ఎకరాల గడ్డివామి దగ్ధం

గన్నవరం: గన్నవరం శివారు మర్లపాలెంలో ప్రమాదవశాత్తు గడ్డివాములకు నిప్పు అంటుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన టి.రాఘవులు, కె.మల్లికార్జునరావు, ఎం.అశోక్‌లకు చెందిన 15ఎకరాల గడ్డివాములు కాలిపోయాయి. బుధవారం మధ్యాహ్నం మంటలు అంటుకుని మిగిలిన గడ్డివాములకు వ్యాపించాయి. స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వటంతో ఎల్ఎఫ్‌లు మల్లిబాబు, సుధాకర్, వి.వెంకటేశ్వరరావులు మంటలను అదుపు చేశారు.

ఆలపాటి రాజా గెలుపునకు కృషి చేయండి



పెదఅవుటపల్లిలో కరపత్రాన్ని టీచర్లకు అందజేసి ఓట్లు అభ్యర్థిస్తున్న కూటమి నాయకులు

ఉంగుటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించే దిశగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని గన్నవరం నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు వల్లభనేని హరిబాబునాయుడు కూటమి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గత నాలుగురోజులుగా నియోజకవర్గంలోని మండల కమిటీల నాయకులతో నిర్విరామంగా సమావేశాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరినీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సమాయాత్తం చేస్తున్న ఎన్డీఏ కూటమి నాయకులు బుధవారం ఉదయం పెదఅవుటపల్లిలో వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కలిసి ఆలపాటి రాజా ప్రచార కరపత్రాన్ని అందజేసి మొదటి ప్రాధాన్యత ఓటును రాజాకు వేయాలని కోరారు. ఈ సందర్భంగా హరిబాబునాయుడు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలందరూ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని ఆలపాటిని భారీ మెజారిటీతో గెలిపించి పెద్దల సభకు పంపించాలని సూచించారు. నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎన్నికల పరిశీలకులు కోటా వీరబాబు మాట్లాడుతూ ఆలపాటి రాజాకు గ్రాడ్యుయేట్లందరూ మద్దతు తెలపాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యనారాయణప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జ్ తంగిరాల శ్రీనివాసరావు, కొండేటి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాల నిర్వహణకు కార్యాచరణ: ఎంపీడీవో



బాపులపాడు డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో జోగేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదను సృష్టించడానికి మండలంలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను నిర్వహించడానికి కార్యచరణ చర్యలు తీసుకుంటున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు తెలిపారు. బుధవారం రైల్వేస్టేషన్ సమీపంలోని బాపులపాడు డంపింగ్ యార్డును, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని ఆయన పంచాయతీ కార్యదర్శి ఎస్.పూర్ణేశ్వరితో కలిసి పరిశీలించారు. డంపింగ్ యార్డులో పేరుకుపోయిన మట్టిని తొలగించి కొత్తగా వచ్చే చెత్తనుంచి వ్యర్థాలను వేరు చేయించాలని, ప్లాస్టిక్, ఇనుము వ్యర్థాలను ఎప్పటికప్పుడు వేరు చేసి విక్రయించి పంచాయతీకి ఆదాయ వనరుగా మార్చుకోవాలని సూచించారు. తడి చెత్తను వర్మీ కంపోస్టుగా మార్చడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శానిటరీ మేస్త్రీ నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లలిత అమ్మవారికి పూజలు

గన్నవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక యాదవుల రామాలయంలో లలిత అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి పంచామృతాలతో అభిషేకాలు, పుష్పా లతో, ఫలాలతో పూజలు చేశారు. అర్చకుడు శర్మ తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ముగిసిన అంకమ్మతల్లి తిరునాళ్ల



అంకమ్మతల్లికి మహానివేదన సమర్పిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బిళ్లనపల్లిలో అంగరంగ వైభవంగా నిర్వహించిన అంకమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవాలు బుధవారం ఆలయ కమిటీ సభ్యులు, కొండపావులూరి వంశీకులు మొక్కులు చెల్లించడంతో ముగిశాయి. అర్చకులు సాయివేణుశర్మ ఆధ్వర్యంలో ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు కొండపావులూరి వెంకట బాబూరావు ఇంటి వద్ద నుంచి మేళతాళాల మధ్య పొంగళ్ల నైవేద్యం తీసుకువచ్చి అమ్మవారి మహానివేదన నిర్వహించారు. ప్రత్యేక పూజలనంతనం వివిధ రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చిన భక్తులు తమ మొక్కుబడులను సమర్పించుకున్నారు. 1200 మందికి పైగా భక్తులకు, గ్రామస్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కొండపావులూరి తులసీరాంప్రసాద్, మోహన్‌కుమార్, హేమంత్‌కుమార్, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీకోదండ రామాలయం పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న యార్లగడ్డ వెంకటేశ్వరరావు దంపతులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రంగయ్యప్పారావుపేటలోని శ్రీకోదండ రామాలయ అభివృద్ధి పనులకు అర్చకులు కమల్‌కుమార్ ఆధ్వర్యంలో యార్లగడ్డ వెంకటేశ్వరరావు దంపతులు, మున్నంగి శ్రీనివాసరావు దంపతులు బుధవారం భూమిపూజ నిర్వహించారు. సుమారు రూ.6 లక్షల వ్యయంతో మండప నిర్మాణం, తదితర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. అభివృద్ధి కమిటీ కోశాధికారి పరుచూరి సుకన్య, సభ్యులు లింగం పిచ్చేశ్వరరావు, ఆలూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ఎంకే స్కూల్ విద్యార్థులకు ప్రథమ బహుమతి

ఉయ్యూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జరిగిన 22వ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ 2024-2025 పోటీల్లో శ్రీఎంకే ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు బేబిశ్రావణి, వర్షిత్‌రెడ్డి ప్రథమ స్థానాలు సాధించారు.


ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎంకె బాబు విద్యార్థులు, కోచ్ రామకృష్ణను అభినందించారు.



నేడు పోరంకి భవ్యరామాలయంలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

పెనమలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పౌరాణికంగా, చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా పేరు పొందిన పోరంకి గ్రామంలో నేడు శ్రీ కోదండరామస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా జరగనున్నాయి. శ్రీవైఖనసాగమ శాస్త్ర ప్రకారంగా పాంచాహ్నిక దీక్షతో జరిగే కోదండరామస్వామి ప్రతిష్ఠా మహోత్సవానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆలయ ప్రచార కర్త ద్రోణవల్లి సుబ్బారావు కోరారు. గురువారం ఉదయాన్నే ప్రారంభమయ్యే పవిత్ర పూజా కార్యక్రమాలతో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పవిత్ర కార్యక్రమాల అనంతరం 12 గంటల నుంచి అన్న సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆలయ విరాళాలు రూ. 7 లక్షలు



పోరంకి భవ్యరామాలయానికి బుధవారం ఒక్కరోజే దాతలు ఏడు లక్షల విరాళాలను అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కర్లపూడి సుబ్బారావు, శారదాదేవిలు ఐదు లక్షలు, కర్లపూడి రాహుల్ సత్యమేఘన, కుమార్తె వర్షిష్టలు లక్ష, తోటకూర శ్రీనివాసరావు, రమ దంపతులు లక్షరూపాయలను విరాళాలుగా అందజేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

గన్నవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెంచుల కాలనీలోని గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.10వేల విరాళాన్ని జనసేన జిల్లా జాయింట్ సెక్రటరీ చిమట రవివర్మ ఆలయ కమిటీ నిర్వాహకులకు బుధవారం అందజేశారు.

వేసవిలో నీటి సంక్షోభం!

పూర్తికాని ఆకుమర్రు మంచినీటి పథకం ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులు

- రూ.2.40 కోట్ల నిధులు విడుదల
- టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు రాలేదన్న సాకుతో పనులు నిలుపుదల
- అధికారుల సాచివేత ధోరణే కారణం..!
- మచిలీపట్నం మండలంలోని 108 ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం



సక్రమంగా పనిచేయని ఆకుమర్రు మంచినీటి పథకం ఫిల్టర్‌బెడ్

అధికారుల సాచివేత ధోరణి, సాంకేతికపరమైన అంశాలు మచిలీపట్నం మండలంలోని 108 ప్రాంతాలకు తాగునీటి ఎద్దడిని తెచ్చిపెట్టేలా ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఆకుమర్రు, మంగినపూడి మంచినీటి పథకాలు రానున్న రోజుల్లో తాగునీటిని ఎంతమేర అందిస్తాయో తెలియని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తరకటూరు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు వద్ద ఉన్న ఆకుమర్రు మంచినీటి పథకంలోని నాలుగు ఫిల్టర్ బెడ్‌లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు మంత్రి కొల్లు రవీంద్ర ప్రభుత్వం నుంచి రూ.2.40 కోట్ల నిధులు విడుదల చేయించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాత్రం టెండర్లు పిలవకుండా వివిధ కారణాలతో జాప్యం చేస్తున్నారు. మరోవైపు వేసవికాలం తరుముకొస్తోంది. ఈ తరుణంలో ఈ మరమ్మతులు పనులు ఎప్పటికి చేస్తారో తెలియని స్థితి.

- ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం

గూడూరు మండలం తరకటూరువద్ద 180 ఎకరాల విస్తీర్ణంలో సమ్మర్‌స్టోరేజీ ట్యాంకును నిర్మించారు. నగరంతోపాటు, మండలంలోని 34 పంచాయతీలు వాటి శివారు ప్రాంతాలకు, పెడన పురపాలక సంఘానికి ఇక్కడి నుంచే తాగునీటి సరఫరా జరుగుతోంది. మండలంలోని అన్ని ప్రాంతాలకు తాగునీటి కోసం ఇక్కడ 4 ఫిల్టర్ బెడ్‌ల నిర్మాణంతోపాటు సంప్‌లు, మోటారు షెడ్‌లను నిర్మించారు. 1996లో ఇర్మించిన ఈ ఫిల్టర్‌బెడ్‌లకు తాత్కాలికంగా మరమ్మతులు చేస్తూ వస్తున్నారు. దగ్గర్లోనే సముద్రతీరంలో ఉండటంతో వేసవిలో పూర్తిగా ఆకుమర్రు మంచినీటి పథకం నుంచే మంచినీరు అందించాలి. గతేడాది వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.45లక్షలను మరమ్మతుల కోసం కేటాయించి నామినేషన్ పద్ధతిలో పనులు ఇచ్చారు. మరమ్మతులు సక్రమం గా చేయకపోవడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వడంతో గతేడాది పనులు నిలిపేశారు.

30 శాతం కూడా పనిచేయని ఫిల్టర్‌బెడ్‌లు

ఆయా ప్రాంతాలకు రోజుకు కనీసం 40 లక్షల లీటర్ల నీరు అవసరం. పాడైన ఫిల్టర్‌బెడ్ల నుంచి ప్రస్తుతం 30 శాతం నీరు ఫిల్టర్ అవుతోంది. మండలంలోని మరో 50 ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు 2008లో మంగినపూడి మంచినీటి పథకాన్ని ఆకుమర్రు మంచినీటి పథకం పక్కనే నిర్మించారు. ఆకుమర్రు ఫిల్టర్ బెడ్‌లు సక్రమంగా పనిచేయకపోవడంతో పక్కనే మంగినపూడి మంచినీటి పథకం ఫిల్టర్‌బెడ్లను ఆరేడేళ్లుగా వినియోగిస్తున్నారు. కేవలం 50 ప్రాంతాలకు సరఫరాచేసే సామర్థ్యంతో నిర్మించిన మంగినపూడి మంచినీటి పథకంపై మరో 58 ఆవాసాలకు సరఫరా భారం పడుతోంది. ఈ పథకంపై పడిన పెనుభారం కారణంగా ఎప్పుడు నిలిచిపోతుందో తెలియనిస్థితి.

నిబంధనలు సడలిస్తేనే..

ఆకుమర్రు ఫిల్టర్‌బెడ్‌ల మరమ్మతులకు రూ.2.40కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే 2 సార్లు టెండర్లు పిలవగా, నిబంధనల కారణంగా కాంట్రాక్టర్లు ముందుకురాని స్థితి. మూడోసారి టెండర్లలో కొద్దిపాటి మార్పులు చేసి పిలిచేందుకు అధికారులు సమాయాత్తమయ్యారు. కాంట్రాక్టర్లకు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు నెలకొన్న విబేధాల పట్ల పాతపద్ధతిలోనే టెండర్లు పిలవాలనే ఆలోచనలో అధికారులున్నట్టు సమాచారం. మరో నాలుగైదురోజుల్లో పంటకాలువలకు సాగునీటి విడుదలను నిలిపేస్తారు. దీంతో సముద్రతీరం వెంబడి గ్రామాల్లో మార్చి నుంచి మనుషులకు, పశుసంపదకు తాగునీటి ఇబ్బందులు ఖాయం. జూలై రెండోవారం వరకు అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడుతుంది. మార్చి రెండోవారంలోనైనా టెండర్లు ఖరారుచేస్తే ఏప్రిల్ నెలాఖరునాటికైనా పనుల పూర్తికి అవకాశం ఉంటుంది. ఈ 4 ఫిల్టర్‌బెడ్‌లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేస్తే ఐదారేళ్లపాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఉండదు. వేసవిలో తాగునీటి ఎద్దడి నుంచి తప్పించేందుకు కలెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు కొద్దిమేరకయినా నిబంధనలు సడలించి యుద్ధప్రాతిపదికన పనులు చేయించాలని మచిలీపట్నం మండల ప్రజలు కోరుతున్నారు.



రూ.2.08 కోట్లతో నిర్మించిన రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

రూ.కోట్లతో నిర్మించే రోడ్లు

క్వాలిటీ లేకుంటే ఎలా..?

- అధికారులను ప్రశ్నించిన కలెక్టర్ లక్ష్మీశ

జగ్గయ్యపేట రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న రహదారుల్లో నాణ్యత లేకుంటే ఎలా..! అధికారుల పని తీరు ఇదేనా? అని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ప్రశ్నించారు. బుధవారం పోచంపల్లి, అనుమంచిపల్లి గ్రామాలలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖాధికారులతో కలిసి ఆయన పర్యటించారు. జాతీయ రహదారి నుంచి పోచంపల్లి గ్రామానికి వెళ్లే పరసబాట డొంకగా పిలిచే డొంకరోడ్డు అభివృద్ధికి 3.700కి.మీలకు గాను రూ.2.08 కోట్లను డీఎంఎఫ్ నిధులు మంజూరు కావటంతో నిర్మాణం చేపట్టారు. ఇంకా కి.మీ పెండింగ్ ఎందుకుందని ఆరా తీశారు. ఈ రోడ్డుకు క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ ఉందా అని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రూ.కోట్లు వెచ్చించి చేపట్టే పనుల్లో ఆయా శాఖలు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనుమంచిపల్లిలో రైతులు 'పొలం పిలుస్తుంది'లో మాట్లాడుతూ తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించాలన్నారు. సాగులోని పంటలు, ఎరువులు, వాటి లభ్యత వివరాలను తెలుసుకున్నారు. యంత్ర పరికరాలు, కోతుల బెడదను రైతులు కలెక్టర్‌కు వివరించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. అసిస్టెంట్ కలెక్టర్ శుభంనోఖ్వాల్, పంచాయతీ రాజ్ ఎస్ఈ రమేష్, వ్యవసాయ శాఖ ఏడీఏ భవానీ, ఎంపీడీవో నితిన్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నేడు తీర్పు

విజయవాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ గన్నవరం నియోజకవర్గ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లపై తీర్పు గురువారం వెలువడనుంది. ఈ కేసులో ఇప్పటికే ఫిర్యాదుదారుడు ముదునూరు సత్యవర్ధన్ తనకు ఎలాంటి సంబంధం లేదని న్యాయాధికారికి వాంగ్మూలం ఇచ్చాడు. బెయిల్ పిటిషన్‌పై న్యాయవాదులు వాదనలు వినిపించారు. బుధవారం వాదనలు పూర్తి కావడంతో తీర్పును న్యాయాధికారి హిమబిందు గురువారానికి వాయిదా వేశారు.

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం

వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

భారతీనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కాలనీలోని ది వెన్యూ కన్వెన్షన్ సెంటర్లో బుధవారం ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వివాదరహితుడు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించే ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం కోసం బీజేపీ నేతలు, కార్యకర్తలు శ్రమించి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందన్నారు. మోదీపై నమ్మకంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాలనాదక్షతకు ఓటు వేసిన రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన జరుగుతుందన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ఆలపాటి గెలుపు ఖాయం: ఎంపీ చిన్ని

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా ఎన్డీయే కూటమి బలపరిచిన ఉమ్మడి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు ఖాయమని, ఎన్టీఆర్ జిల్లాలో భారీమెజార్టీ వస్తుందని ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు. ఎన్డీయేకూటమి బలపఅభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన ఎన్డీయే కూటమి నేతల ఆత్మీయ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొని మాట్లాడారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు నమోదు చేయించుకున్న గ్రాడ్యుయేటర్ల ఓటర్ల మ్యాపింగ్ చురుగ్గా సాగుతుందన్నారు.

ఎన్డీయే కూటమి నేతలు ప్రతి 30 మంది ఓటర్లకు ఒక పరిశీలకుడిని నియమించి మ్యాపింగ్ చేస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి నెట్టెం రఘురాం, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, తంగిరాల సౌమ్య, వసంత కృష్ణప్రసాద్, కొలికపూడి శ్రీనివాసరావు, శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మచిలీపట్నం పార్లమెంట్ అధ్యక్షుడు రాజాబాబు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీనాథ్, జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాసరాజు, ఏపీ స్టేట్ మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు కనపర్తి శ్రీనివాసరావు, ఎం ఎస్ బేగ్, కూటమి నేతలు, నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు పాల్గొన్నారు.

పాన్‌కార్డు 2.0 వచ్చేసింది

- మరింత సెక్యూరిటీ ఫీచర్లతో సర్వీస్ వేగవంతం
- ఆర్థిక మోసాలకు చెక్.. దుర్వినియోగానికి పాతర
- క్యూ ఆర్ కోడ్‌తో అడ్వాన్స్ ఫీచర్స్

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి జీవితంలో పాన్‌కార్డు భాగమైపోయింది. అంతేకాదు అత్యంత కీలకంగానూ మారింది. బ్యాంకు లావాదేవీలు, క్రెడిట్ కార్డులు, బ్యాంకు లోన్లు, ఇన్‌కంటాక్స్ రిటర్న్ ఇలా డబ్బుతో ముడిపడిన లావాదేవీలు ఏవైనా పాన్‌కార్డు ఉండాల్సిందే. బడా పారిశ్రామికవేత్తలు, ఉద్యోగుల నుంచి చిరు వ్యాపారుల వరకు పాన్‌కార్డు తప్పనిసరి. అయితే ఈ పాన్‌కార్డును కేంద్ర ప్రభుత్వం మరింత అడ్వాన్స్ ఫీచర్స్‌తో రూపొందించింది. 'పాన్ 2.0' పేరుతో అప్‌డేట్ వర్షన్‌తో అందుబాటులోకి వచ్చింది. గతంతో పోలిస్తే వేగవంతమైన సర్వీస్, పటిష్ట సెక్యూరిటీతో ఆర్థిక మోసాలకు తావులేకుండా క్యూఆర్ కోడ్‌తో తెచ్చింది. ఈ పాన్ 2.0ను ఆన్‌లైన్‌లోని ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉచితంగా పొందే సౌకర్యం కల్పించింది. ప్రస్తుతం చలామణిలో ఉన్న పాన్‌కార్డుతో వెరిఫికేషన్‌కు ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తుంది. లావాదేవీల సమయంలోనూ ఒరిజినల్ పాన్‌కార్డును అందుబాటులో ఉంచుకోవాలి. అయితే పాన్ 2.0తో అలాంటి ప్రక్రియలేమీ ఉండవు. కేవలం ఒకే ఒక్క క్యూ ఆర్ కోడ్ స్కాన్‌తో పూర్తి వివరాలు ఆటోమెటిక్‌గా లభిస్తాయి. డూప్లికేట్ పాన్‌కార్డుల వినియోగం, పాన్‌కార్డులను దుర్వినియోగం జరగదు. భౌతికంగా కార్డు పొందాలనుకుంటే మాత్రం రూ.50 చెల్లించాలి. పాన్ 2.0 రాకతో పాత పాన్‌కార్డులు చెల్లవనే అపోహలు అవసరం లేదు. కొత్త కార్డులు తీసుకోవాలన్న తప్పనిసరి నిబంధన లేదు. పాత పాన్‌కార్డులు యథావిధిగానే పనిచేస్తాయి. అయితే భద్రత, వేగవంతమైన సర్వీస్ కావాలనుకుంటే మాత్రం ఆన్‌లైన్‌లో కొత్త పాన్ 2.0ను పొందవచ్చు.





గిరిప్రదక్షణలో పాల్గొన్న అధికారులు, అర్చకులు, భక్తులు

భక్తి ప్రపత్తులతో

దుర్గమ్మ గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని మాసవారీ కార్యక్రమంలో భాగంగా గంగా, పార్వతీ మల్లేశ్వర ఉత్సవమూర్తుల గిరిప్రదక్షణ నిర్వహించారు. ఉదయం ఆలయం నుంచి ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్దకు తీసుకొచ్చారు. అక్కడ అన్నపు రాశిని పోసి బలిహరణలు సమర్పించారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, గుమ్మడికాయ దిష్టితీశారు. డిప్యూటీ ఈవో రత్నరాజు, ఈఈ కోటేశ్వరరావు, ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి కొబ్బరికాయలు కొట్టి బలిహరణలు సమర్పించారు. అనంతరం డిప్యూటీ ఈవో, ఈఈ, స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, శ్రీనివాస శాస్త్రి, ఉద్యోగులు, భక్తులు ఉత్సవమూర్తులను ఉంచిన బండిని లాగారు. భక్తుల నినాదాల మధ్య గిరిప్రదక్షిణ కోలాహలంగా ప్రారంభమైంది. మేళతాళాలు, తప్పెట వాయిద్యాలు, భక్తుల భజనలు, తదితర భక్తిపారవశ్య వాతావరణంలో గిరిప్రదక్షణ బయలుదేరింది. కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం సెంటర్, కబేలా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంట్ల మీదుగా బయలుదేరి తిరిగి ఘాట్‌రోడ్డు మీదుగా ఉత్సవమూర్తులు కొండపైకి చేరుకున్నారు. అనేకచోట్ల భక్తులు కొబ్బరికాయలు, పండ్లు, హారతులు సమర్పించి, పసుపు నీళ్లతో వారు పోశారు. వందలాది భక్తులు పాల్గొన్నారు.

ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ రాష్ట్ర హెడ్‌గా భార్గవ్

వన్‌టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ రాష్ట్ర హెడ్‌గా విజయవాడకు చెందిన వల్లూరు భార్గవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఏపీసీసీ పనిచేస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలారెడ్డి నాయకత్వంలో ప్రజా సమస్యలపై నిరంతరం ఇప్పటికే పనిచేస్తున్నారన్నారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

79 మంది రైతులకు 191 ప్లాట్ల కేటాయింపు

వన్‌టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌డీఏ కార్యాలయంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో మంగళగిరి, తుళ్లూరుకు చెందిన 79 మంది రైతులకు 191 రిటర్నబుల్ ప్లాట్లును కేటాయించి ప్రొవిజనల్ సర్టిఫికెట్లను అందచేసినట్టు ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు చెప్పారు. లాటరీ ద్వారా ఈ కేటాయింపులు జరిగాయి. కృష్ణాయపాలెం, నవులూరు 1, 2, నిడమర్రు 1, 2, వెలగపూడి మందడం 1, 2, కొరగల్లు 1, 2, తుళ్లూరు 1, 2, నెక్కల్లు, అనంతవరం రైతులకు లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రైతులు వీలైనంత త్వరగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసుకోవాలని సూచించారు. ఎల్‌పీఎస్ భూముల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యం కాకుండా ఉండేందుకు కొత్తగా 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలను ప్రారంభించినట్టు తెలిపారు. సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సాయి ప్రవీణ్ చంద్, ల్యాండ్స్ జాయింట్ డైరెక్టర్ డేవిడ్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.భీమారావు, శేషురెడ్డి, రవీందర్, పి.పద్మావతి, కె.స్వర్ణమేరి, ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. గురువారం 364 రిటర్నబుల్ ప్లాట్‌కు లాటరీ విధానం కేటాయించనున్నారు. అమరావతి కోసం భూమలిచ్చిన 11 గ్రామాల్లోని 167 మంది రైతులకు ప్లాట్లను కేటాయించనున్నారు. దొండపాడు, పిచ్చుకలపాలెం, ఐనవోలు, లింగాయపాలెం, శాఖమూరు, వెంకటపాలెం రైతులకు ఉదయం 10 గంటల నుంచి, ఉద్ధండరాయునిపాలెం, మల్కాపురం, రాయపూడి 1, 2, కొండమరాజుపాలెం, అబ్బరాజుపాలెం గ్రామాల రైతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్లాట్ల కేటాయింపు జరుగుతుందన్నారు.



రైతులకు రిట్నబుల్ ప్లాట్లు కేటాయింపులు చేస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

విజయవాడలో ఎస్టీపీలకు రూ.16.7 కోట్లు

- పరిపాలన అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఐక్యరాజ్య సమితి అనుబంధం యూఎన్ఐడీవో ఆర్థిక సహకారం రూ. 11.77 కోట్లు
- విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వాటా రూ.4.93 కోట్లు



విజయవాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) పరిధిలో ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (యూఎన్ఐడీవో) ఆర్థిక సహకారంతో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, నాలుగు బయో ఎనర్జీ ప్లాంట్స్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పరిపాలన అనుమతులను జారీ చేసింది. దీంతో నగరంలో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఆధునీకరణకు మార్గం ఏర్పడింది. వీఎంసీ పరిధిలో యూఎన్ఐడీవో బృందం పరిశీలించిన క్రమంలో నగరాభివృద్ధికి తన వంతు గ్రాంటును ఇస్తానని అప్పట్లో తెలిపింది. ఆ ప్రకారం గతంలో బృందం పర్యటించిన మేరకు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాట్ల ఆధునీకరణకు, అభివృద్ధికి రూ.11.77 కోట్లు ఇవ్వటానికి ముందుకొచ్చింది. సంస్థ కార్పొరేషన్‌తో భాగస్వామ్యంగా ఉండటంతో తన వాటాగా వీఎంసీ రూ.4.93 కోట్లను ఖర్చు చేయటానికి సిద్ధమైంది. వీఎంసీ కమిషనర్ ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి నిర్దేశించటంతో ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో రామలింగేశ్వరనగర్‌లోని 20 ఎంఎల్‌డీ ఎస్టీపీ ప్లాంట్‌తో పాటు అజిత్ సింగ్‌నగర్-2, జక్కంపూడి, రామలింగేశ్వరనగర్‌లలోని బయోగ్యాస్ ఎనర్జీ ప్లాంట్ల మరమ్మతులకు నిధుల కేటాయింపు జరుగుతుంది. దీంతో నగరంలో మురుగునీటిని శుద్ధి చేయటంతో పాటు బయోగ్యాస్ ఉత్పత్తి, దీని ద్వారా విద్యుదుత్పత్తికి మార్గం ఏర్పడుతోంది.

చర్లపల్లి - కాకినాడ టౌన్, చర్లపల్లి - నరసాపూర్

వారాంతపు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి - కాకినాడ టౌన్, చర్లపల్లి - నరసాపూర్ మధ్య వారాంతపు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌వో నస్రత్ మండ్రూపకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రద్దీ నియంత్రణకు ఈ రైళ్లను ఈనెల 23 వరకు నడుపుతున్నట్టు తెలిపారు. 07031 చర్లపల్లి - కాకినాడ టౌన్ రైలు చర్లపల్లిలో రాత్రి 7.20 గంటలకు బయలుదేరి కాకినాడ టౌన్‌కు ఉదయం 4.30 గంటలకు చేరుతుంది. ఈనెల 14, 21 తేదీల్లో నడుస్తుంది. 07032 కాకినాడ టౌన్ - చర్లపల్లి రైలు కాకినాడలో సాయంత్రం 6.55కు బయలుదేరుతుంది. చర్లపల్లికి ఉదయం 6.50 గంటలకు చేరుతుంది. ఈ రైలు ఈనెల 16, 23 తేదీల్లో నడుస్తుంది. 07233 చర్లపల్లి - నరసాపూర్ రైలు రాత్రి 7.15కు చర్లపల్లిలో బయలుదేరి నరసాపూర్‌కు ఉదయం 5.50 గంటలకు చేరుతుంది. ఈ రైలు ఈనెల 14, 21 తేదీల్లో నడుస్తుంది. 07234 నరసాపూర్ - చర్లపల్లి రైలు నరసాపూర్‌లో రాత్రి 8 గంటలకు బయలుదేరి చర్లపల్లికి ఉదయం 8 గంటలకు చేరుతుంది. చర్లపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది. దీనికి టూఏసీ, త్రీ ఏసీ, స్లీపర్, జనరల్, రెండో తరగతి కోచ్‌లు అనుసంధానం చేశారు. చర్లపల్లి - నరసాపూర్ ప్రత్యేక రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతుంది. టూ ఏసీ, త్రీ ఏసీ, స్లీపర్, జనరల్, రెండో తరగతి కోచ్‌లు అనుసంధానం చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.450

అనధికార లే అవుట్ ధ్వంసం



పెడన, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ అధికారులు అక్రమ లేఅవుట్‌ను అడ్డుకున్నారు. మునిసిపాలిటీ నుంచి అనుమతులు తీసుకోకుండా పట్టణంలోని సాయినగర్ కాలనీ పక్కన 80సెంట్ల స్థలంలో ఒకరు లే అవుట్ వేశాడు. సమాచారం అందుకున్న మునిసిపల్ అధికారులు బుధవారం లే అవుట్‌ను పరిశీలించి ఎటువంటి అనుమతులు లేవని ధ్వంసం చేశారు. రాళ్లను తొలగించి బోర్డు ఏర్పాటు చేశారు. టీపీవో బి. సుజనకుమారి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు పామర్తి జితేంద్ర, బండి కిరణ్, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సమగ్ర కౌలు చట్టాన్ని తేవాలి

కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య

చల్లపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కౌలురైతుల సంక్షేమం కోసం తక్షణమే సమగ్రమైన కౌలుచట్టాన్ని తీసుకురా వాలని, అన్నదాత సుఖీభవన పథకం కింద రూ.20వేలు పెట్టుబడి సాయం అదించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. కౌలు రైతుల సంఘం పిలుపులో భాగంగా చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు పూర్తవుతున్నా ఇంతవరకు కౌలు చట్టాన్ని తీసుకురా వటంలో విఫలమైందన్నారు. చట్టం లేకపోవటం వల్ల వ్యవసాయ, ఉద్యానపంటలకు బ్యాంకులు ఇచ్చే రుణాలు కౌలురైతులు పొందలేకపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మంది కౌలురైతులుంటే గుర్తింపు కార్డులు ఎంతమందికి ఇచ్చారో చెప్పాలన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో కౌలురైతులకు రూ.3820 కోట్లు పంట రుణాలుగా ఇచ్చామని చెప్పటం బూటకమన్నారు. వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు గుర్తింపు కార్డుల లేవనీ, పంట రుణాలు ఇవ్వటం లేదనీ అలాంటపుడు బినామీ వారే రుణాలు పొందుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ పంటలను అమ్ముకోలేక మధ్య దళారులకు అమ్ముకుని నష్టపోతున్నారనీ, బ్యాంకుల ద్వారా రుణాలు పొందలేక అధిక వడ్డీలకు అప్పులు తీసుకువచ్చి పంటలు పండిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే నూతన కౌలురైతుల చట్టాన్ని తీసుకురావాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు తలారి రామారావు, నియోజకవర్గ కార్యదర్శి అట్లూరి వెంకటేశ్వరరావు, గోగినేని రత్తయ్య, లంక నాగమల్లేశ్వరరావు, ఏఐవైఎఫ్ నేత సిద్ధాబత్తుల వాసు పాల్గొన్నారు.



చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

రేషన్ దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

మోపిదేవి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కోసూరువారిపాలెం గ్రామంలో రేషన్ దుకాణంపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి 6ఏ కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ వాణి తెలిపారు. బుధవారం రేషన్ దుకాణానికి వెళ్లి ప్రస్తుతం ఉన్న సరుకులు, రికార్డులు పరిశీలించగా 250 కేజీల బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించారన్నారు. ఈ మేరకు 6ఏ కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

నాగాయలంక, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని 22గ్రామపంచాయతీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీలు చేసిన వివిధ పనులకు సామాజిక తనిఖీలను బుధవారం రిసోర్స్ పర్సన్ నేతృత్వంలో ప్రారంభించినట్లు ఏపీవో టి.వి.ఎన్. ముత్యాలు తెలిపారు. సామాజిక తనిఖీల్లో కూలీల వేతనాలు రూ.11,04,73,851కాగా, మెటీరియల్ 1,90,64,345లు ఉందన్నారు. ఐదు బృందాలుగా క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఏపీవో తెలిపారు.

కోడిమాంసం దుకాణాల్లో..

బర్డ్ ఫ్లూ ఉన్న ప్రాంతాల కోళ్లను, గుడ్లను సరఫరా చేయరాదని మండల పశుసంవర్థకశాఖ వైద్యాధికారి సాయిమౌనిక దుకాణాలదారులను హెచ్చరించారు. బర్డ్ ఫ్లూ విస్తరిస్తున్న తరుణంలో ఆమె బుధవారం నాగాయలంకలోని కోడి మాంసం దుకాణాలను తనిఖీ చేశారు. ముందస్తు జాగ్రత్తలను వారికి సూచించారు. ప్రభావిత ప్రాంతాల నుంచి కోళ్లను, గుడ్లను తీసుకొచ్చి విక్రయించరాదని ఆమె ఆదేశించారు.

మన కోసం మనం ట్రస్టుకు రూ.25 వేల విరాళం

చల్లపల్లి: స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధనలో భాగంగా అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్న మన కోసం మనం ట్రస్టుకు విశ్రాంత ఉపాధ్యాయులు రావూరి సూర్య ప్రకాశరావు రూ.25 వేల విరాళాన్ని అందించారు. స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డి.ఆర్‌కె.ప్రసాద్‌ను బుధవారం కలసి విరాళాన్ని అందించారు.


డాక్టర్ డీఆర్‌కేకు చెక్కు అందజేత


జ్యోతి వెలిగించి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కొనకళ్ల, మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు

శంకర కంటి ఆసుపత్రి సేవలు అభినందనీయం

మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత వైద్యం అందించడంలో ఎంతో ఆనందం ఉంటుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కొల్లు ఫౌండేషన్, ఫీనిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లలిత కన్వెన్షన్ హాలులో బుధవారం శంకర కంటి ఆసుపత్రి నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రామకృష్ణ ప్రారంభిచారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ శంకర కంటి ఆసుపత్రి సేవలు అభినందనీయమన్నారు. దాదాపు 350ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి నాలుగున్నర లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించారన్నారు. ఉచితంగా ఆపరేషన్లు చేయడం అభినందనీయమన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల మాట్లాడుతూ నేత్రాలపై శ్రద్ధ వహించాలన్నారు. కొల్లు ఫౌండేషన్ ప్రతినిధి కొల్లు నీలిమ మాట్లాడుతూ, స్వర్శ కార్యక్రమాల ద్వారా కొవిడ్ సమయంలో పేదలకు సాయం అందించామన్నారు. కార్యక్రమంలో కొల్లు పునీత్, ఫీనిక్స్ ఫౌండేషన్ ప్రతినిధి చుక్కపల్లి అవినాష్, గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, తెలుగు యువత నగర అధ్యక్షుడు సలీం తదితరులు పాల్గొన్నారు.


గాయత్రి, రాజేష్‌లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు

గాయత్రి, రాజేష్‌లకు పౌరసత్కారం

నాగాయలంక, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ జలక్రీడల పోటీల్లో నాగాయలంకకు చెందిన నాగిడి గాయత్రి స్వర్ణ పతకాన్ని గెలుపొందారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలో ఆమెకు పౌర సత్కారం జరిగింది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తోపాటు కూటమి నేతలు గాయత్రితోపాటు క్రీడాకారుడు నాగిడి రాజేష్‌ను సత్కరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్థిరావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ జాతీయ స్థాయికి నాగాయలంక ఊరు పేరును తీసుకెళ్లిన గాయత్రిని అభినందించారు. జగన్ పాలనలో జలక్రీడల అకాడమీని, పడవల పోటీలను అటకెక్కించిందని విమర్శించారు. గాయత్రి ఒలింపిక్స్‌లో పాల్గొనేలా అందరూ కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో కైతేపల్లి అంకాలు, తలశిల స్వర్ణలత, లంకే శ్రీనివాస ప్రసాద్, లకనం నాగాంజనేయులు, నాగిడి తాతారావు, మెండు లక్ష్మణరావు, వర్రే రాంబాబు, బోనం పాపారావు, చిట్టా అన్నపూర్ణయ్య, చన్నగిరి లతామోహన్, బండ్రెడ్డి హరి, ఆలూరి శ్రీనివాసరావు, తలశిల రఘుశేఖర్, రేవు సువర్ణరాజు, భోగాది శివవిష్ణు పాల్గొన్నారు.

కవి సూర్యనారాయణకు..

దివిసీమకు చెందిన కవి, రచయిత జి.సూర్యనారాయణకు పౌర సత్కారం చేశారు. ఆయన రచించిన గోరువెచ్చని సూరీడు కవితా సంపుటికి కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో కవితా సత్కారం లభించింది. బుధవారం శ్రీరామపాదక్షేత్రంలో బుద్ధప్రసాద్, ఏఎస్ఎం మాజీ చైర్మన్ మండవ బాలవర్థిరావు, తదితరులు సత్కరించారు.


బందురులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో శావల దేవదత్

ఆలపాటి గెలుపే లక్ష్యంగా పని చేద్దాం

కొమ్మారెడ్డి పట్టాభి, శావల దేవదత్

అవనిగడ్డ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలనిఅవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం సమావేశమై పట్టాభి 9 వేలకుపైగా ఉన్న గ్రాడ్యుయేట్ ఓటర్లందరిని నేరుగా మూడు సార్లు కలిసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. బయట ప్రాంతాల్లో ఉన్న వారంతా ఓట్లు వేసేందుకు వచ్చేలా పార్టీ నేతల ద్వారా కృషి చేస్తున్నామన్నారు. పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయం ఖాయమని పట్టాభి అన్నారు. బొబ్బా గోవర్ధన్, కొల్లూరి వెంకటేశ్వరరావు, దాసినేని శ్రీనివాసరావు, బచ్చు రఘునాథ్, కోట సాయి, పోతురాజు పాల్గొన్నారు.

బంటుమిల్లి మండలంలో కాగిత..

ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలంటూ పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మండలంలో విస్తృత పర్యటన గావించారు. కార్యక్రమంలో కూనపరెడ్డి వీరబాబు, యిల్లూరి లీలాకృష్ణ, అంగర రంగనాథ్, బొర్రా కాశీ, జొన్నలగడ్డ కొండ, రంగనాథ్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం టౌన్: ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఎమ్మెల్సీగా పంపితే నిరుద్యోగ గ్రాడ్యుయేట్‌లకు మేలు జరుగుతుందని మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు శావల దేవదత్ అన్నారు. నారాయణ, పద్మావతి మహిళ బీఈడీ కళాశాలలో గొర్రెపాటి గోపీచంద్, పి.వి.ఫణికుమార్‌లతో కలిసి పాల్గొన్నారు.

పెడన రూరల్ : ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు గొట్టుముక్కల రఘురామరాజు, శీరం ప్రసాద్, కూటమి నాయకులతో కలసి చోడవరం, శేరీవర్తర్లపల్లిలో ఓటర్లను కలసి తొలి ప్రాధాన్యతా ఓటును ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వేయాలని కోరారు. ఉరివి, చెన్నూరు, చేవేంద్ర, కాకర్లమూడి, కమలాపురం గ్రామాలల్లో ప్రచారం చేశారు.







ఎరువుల షాపుల్లో తనిఖీలు

అవనిగడ్డ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ ఫెర్టిలైజర్స్ షాపుల్లో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ధరణి ట్రేడర్స్‌లో రూ.24 లక్షల విలువైన పురుగు మందులను సీజ్ చేశారు. తనిఖీల్లో రూ.24.21 లక్షల విలువైన 912.82 లీటర్ల వివిధ రకాల పురుగు మందులు ధ్రువీకరణ పత్రాలు లేకుండా విక్రయానికి ఉంచటంతో వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ సంచాలకులు ఎ.మద్దులేటి, వ్యవసాయశాఖ సంచాలకులు జె.ఎస్.జయప్రద, వ్యవసాయాధికారి శౌరమ్మ తనిఖీల్లో పాల్గొన్నారు. ఎరువుల దుకాణాల డీలర్లు తప్పకుండా రికార్డులు నిర్వహించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మోపిదేవి: అవనిగడ్డ డివిజన్ పరిధిలో ఎరువులు, పురుగుమందల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హర్ష ట్రేడర్స్‌ను ఏడీ ఏ సుదర్శన్, ఏవో అరుణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేసి, పురుగు మందుల షాప్‌లో రికార్డులు, లైసెన్స్‌లు, బిల్లులు, పురుగు మందుల గోడౌన్‌ను కూడా పరిశీలించారు. పురుగు మందుల ధరలు ఎప్పటికప్పుడు బోర్డు మీద రాసి ఉంచాలన్నారు. అవనిగడ్డ ఏడీఏ జయప్రద, ఏవో హెబ్సిబా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీటాకీసు సెంటర్‌లో బుధవారం ఒక కారు వేగంగా బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చిలకలపూడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కన్నుల పండువగా వేణుగోపాలస్వామి కల్యాణం



కోడూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హంసలదీవి రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణం మంగళవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్యం అవధాని ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ కుప్ప రామగోపాలస్వామి యాజీ దంపతులచే శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

ఈడేపల్లి గంగానమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు

మచిలీపట్నం టౌన్: ఈడేపల్లిలోని గంగానమ్మతల్లి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. అన్నప్రసాదం వితరణ చేసిన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. దేవనూరి వీరబాబు, గడ్డం రాజు పాల్గొన్నారు.

నాంచారమ్మ సంబరాలు

చల్లపల్లి : లక్ష్మీపురంలో లక్ష్మీనాంచారమ్మ వార్షిక సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. మండలి వెంకట్రామ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలు సమర్పించారు.

వైభవంగా కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం

చల్లపల్లిలోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. చల్లపల్లి రాజా మనుమడు యార్లగడ్డ హరీశ్వర ప్రసాద్ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణాన్ని జరిపించారు. అనంతరం నంది వాహనంపై ఉత్సవ విగ్రహమూర్తులకు గ్రామోత్సవం జరిపారు.

ఘనంగా అగస్త్య మహర్షి, లోపాముద్రదేవి విగ్రహాల ప్రతిష్ఠ



ఘంటసాల: బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామి దేవాలయంలో ఏకపీఠంపై శివపార్వతు లను ప్రతిష్ఠించిన అగస్త్య మహర్షి, లోపాముద్రదేవి దంపతుల విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. శివానంద సత్సంకల్ప ఫౌండేషన్ ప్రతినిధులు వడ్లాల వేణుమాధవ్, శ్రీవిద్య దంపతుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ వయోలిన్ విద్వాంసుతులు రమా గమిని, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, పీసుపాటి నరసింహారావు, వేమూరి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సెంట్రల్‌జోన్ ఆటల పోటీలు

అవనిగడ్డ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డలో జరుగుతున్న సెంట్రల్ జోన్ బాలికల అథ్లెటిక్స్ పోటీలు బుధవారంతో ముగిశాయి. 800 మీటర్ల రన్నింగ్‌లో లింగారెడ్డిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని దివ్య, గొడవర్రు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మేరీ జ్యోత్స్న, స్వతంత్రపురం జడ్పీ పాఠశాల విద్యార్థిని శ్రీవల్లిలు వరుస స్థానాలు సాధించారు. లాంగ్ జంప్‌లో లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన మెండు ప్రియ, అవనిగడ్డకు చెందిన ప్రణవి, ఈడ్పుగల్లుకు చెందిన దీప్తి,1500 మీటర్ల రన్నింగ్‌లో లింగారెడ్డిపాలెం విద్యార్థిని దివ్య, గొడవర్రు విద్యార్థిని మేరీ జ్యోత్స్న, గొడవర్రు విద్యార్థిని దీపిక, షాట్‌పుట్ విభాగంలో మంగళాపురం గ్రామానికి చెందిన కె.వాసవి, లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన మధుప్రియ, గొడవర్రుకు చెందిన శ్రీజ, డిస్కస్ త్రోలో గొడవర్రుకు చెందిన శ్రీజ, గొడవర్రుకుచెందిన ప్రవల్లిక, చిన్నగొల్లపాలెంకు చెందిన జ్వాలా, హైజంప్‌లో లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన షేక్ సిద్ధిక, మచిలీపట్నంకి చెందిన ఎం.జయజ్యోతిక, పామర్రుకు చెందిన కె.అయుష్య మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. 400మీటర్ల రన్నింగ్‌లో ఈడ్పుగల్లుకు చెందిన కె.దేవిశ్రీ, సాయిదీప్తి, తాడంకికి చెందిన బి.వెంకట లక్ష్మి, స్వతంత్రపురం గ్రామానికి చెందిన పివి.నందిని, హేమర్‌త్రోలో మంగళాపురం గ్రామానికి చెందిన కె.వాసవి, శ్రీలక్ష్మి, వై.రేవతి, జూనియర్ గర్ల్స్ విభాగంలో లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన కె.వెంకమ్మ, ఈడ్పుగల్లుకు చెందిన దివ్య హాసిని, ఉయ్యూరుకు చెందిన సాయిలక్ష్మి, షాట్‌పుట్ విభాగంలో కె.లక్ష్మి, గీతిక, శశికళ, హైజంప్‌లో శ్రీకాకుళం గ్రామానికి చెందిన పూజ, పామర్రుకు చెందిన తాన్వి, లింగారెడ్డి పాలెం గ్రామానికి చెందిన లంకమ్మలు వరుస స్థానాలు సాధించారు. డిస్కస్ త్రోలో మంగళాపురం గ్రామానికి చెందిన శశికళ, పామర్రుకు చెందిన శాన్వి, షర్మిక, 400 మీటర్ల రన్నింగ్ విభాగంలో ఈడ్పుగల్లుకు చెందిన దుర్గాభవాని, లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన లంకమ్మ, గన్నవరానికి చెందిన ప్రశాంతి, లాంగ్ జంప్‌లో ఈడ్పుగల్లుకు చెందిన గాయత్రి, శ్రీకాకుళానికి చెందిన పూజశ్రీ, లింగారెడ్డిపాలెంకు చెందిన రమ్య, 100మీటర్ల పరుగు పందెంలో చిన్నగొల్లపాలెం గ్రామానికి చెందిన జాన్ వెస్లీ, ఈడ్పుగల్లుకు చెందిన గాయత్రి, చిన్నగొల్లపాలెం గ్రామానికి చెందిన అనుహ్య మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

డీఎస్పీ కార్యాలయంలో ఐజీ తనిఖీలు

గుడివాడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయాలని ఏలూరు రేంజ్ ఐ.జి జి.అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి, కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌ల పరిధిలోని ముఖ్య, అనుమానిత ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలన్నారు. నేరాల తగ్గుదలకు కృషి చేయాలన్నారు. పౌరసేవల్లో ఎటువంటి ఆటంకం రాకుండా చూసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, డీఎస్పీ ధీరజ్ వినీల్, సీఐలు, ఎస్.ఐలు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఏలూరు రేంజ్ ఐజి జి.అశోక్‌కుమార్

ఉచిత మెగా వైద్య శిబిరం నేడు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నేడు గుడ్లవల్లేరు లయన్స్ సేవాభవన్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నామని క్లబ్ అధ్యక్షులు శశికళ తెలిపారు. ఈ శిబిరంలో మహిళలకు మాత్రమే మణిపాల్ సూపర్‌స్పెషాలిటీ వైద్య బృందంచే రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నారని శశికళ తెలిపారు. అలానే బీపీ, ఆర్.బి.ఎస్(షుగర్ టెస్టు),మెమోగ్రఫీ(45 సంవత్సరములు పైబడిన వారికి),ఈసీజీ, ఎకో, కార్డియాలజీ కన్సల్టేషన్‌లు ఉచితంగా నిర్వహిస్తామని ఆమె తెలిపారు. శిబిరం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ నిర్వహిస్తారని ఆమె తెలిపారు.

ఘనంగా పర్వతనేని 20వ వర్ధంతి

గుడివాడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ స్టేడియం నిర్మాణంలో భాగస్వామ్యులైన పర్వతనేని జగన్మోహనరావును ఎవరు మరువలేరని, వారు చేసిన కృషి అనిర్వచనీయమని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. కీర్తిశేషులు పర్వతనేని జగన్మోహనరావు 20వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆవరణలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, సభ్యులు పర్వతనేని ఆనంద్, స్టేడియం మేనేజర్ యమ్.సత్యనారాయణ, సిబ్బంది, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఒకరి మృతి

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలం బొమ్ములూరు గ్రామానికి చెందిన వేములపల్లి బుజ్జిబాబు (64) గుడివాడ పెద్ద కాలువ సెంటర్ వద్ద గుండెపోటుతో మృతి చెందారు. ఆర్టీసీ బస్సు పెద్ద కాలువ సెంటర్‌లో వేగంగా వస్తుండటం గమనించాడు. అనంతరం బస్సును పక్కకు ఆపి బస్సు డ్రైవర్‌పై కేకలు వేశాడు. ఈక్రమంలో ఒక్కసారిగా గుండెపోటుతో మరణించారు. పక్కన వారు ఆయన్ని పట్టుకునేలోగా మృతి చెందారు.ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.



సూర్యఘర్ యోజనను సద్వినియోగించుకోవాలి

● మెప్మాప్రాజెక్టు డైరక్టర్ పెనుమూడి సాయిబాబు

పామర్రు,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అన్ని వర్గాలగృహా విద్యుత్ వినియోదారులకు రాయితీతో అందిస్తున్న ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని వినియోగించుకునే విధంగా గ్రామాల్లోని ప్రజల్లో మరింత చైతన్యం తీసుకువచ్చే బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శి సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా ఎనిమేటర్లపై ఉందని మెప్మాప్రాజెక్టు డైరక్టర్ పెనుమూడి సాయిబాబు అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, గ్రామసచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా సంఘల ప్రతినిధులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సొంత గృహం కలిగిన ప్రతీ విద్యుత్ వినియోదారుడు ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. గృహ యాజమనులు ఇంటిపై కప్పులపై సౌర పలకాలను అమర్చుకోవడం ద్వారా 300 యూనిట్ల వరకు



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబు

విద్యుత్ చార్జీలు మినహాయింపు లభిస్తోందన్నారు. ఈపథకం 2025 నుంచి 27 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈపథకాన్ని వినియోగించుకునే వారు పీఎం సూర్యఘర్ యోజన పథకం అఫీషియల్ వెబ్‌సైట్లో ముందుగా పేర్లు నమోదు చేసుకుని అనంతరం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటి దస్తావేజులు,విద్యుత్ కనెక్షన్ దరఖాస్తుదారుని పేరుమిదనే ఉన్నావారేకే అర్హత ఉందన్నారు. ఈపథకంలో భాగస్వాములైన సౌర శక్తివినియోదారులు ఉత్పత్తి చేసే విద్యుత్‌లో మొదటి 300 యూనిట్లు లబ్ధిదారులు ఉచితంగా వాడుకోవచ్చునని, మిగిలిన 600 యూనిట్లు నెట్ మీటరింగ్ ద్వారా అమ్ముకోవచ్చునని వివరించారు. మూడు కిలో వాట్ల సౌర విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేసుకోవడం కోసం రూ.1.45లక్షల ఖర్చుఅవుతుందన్నారు. దీనిలో రూ78వేల రూపాయలు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఒక కిలో వాట్ నుండి 10 కేవీ వరకు సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈపథకంపై మరింత అకర్షితులయ్యే విధంగా గ్రామ సభలు నిర్వహించి పోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే. జ్యోతి, వెలుగు డీపీఎం కనకరావు, ఏపీఎం తిరుపతిరావు, పంచాయతీకార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా యేనిమెటర్లు, విద్యుత్‌శాఖ లైన్‌మెన్లు పాల్గొన్నారు.



అమ్మవారికి పాదుకలను దర్శించుకున్న భక్తులు

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెదపారుపూడి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భూషణగుళ్ల గ్రామంలో వీరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి మొక్కులు తీర్చుకున్న భక్తులు ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేక అలంకరణతో పూజలు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు.

16 నుంచి 10కె రన్ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న యలవర్తి శ్రీనివాసరావు

గుడివాడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : కీర్తిశేషులు పర్వతనేని జగన్మోహనరావు 20వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన 10కె రన్ నిర్వహిస్తున్నట్టు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 16వ తేదీ ఉదయం 6గంటలకు జగన్మోహనరావు మెమోరియల్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో పురుషులకు 10కె రన్, మహిళలకు 6కె రన్, బాలబాలికలకు, 12సంవత్సరాల లోపు వారికి 4కె రన్ వేరువేరుగా నిర్వహించనున్నట్టు తెలిపారు. 10కె రన్‌లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.6,116లు, ద్వితీయ బహుమతిగా రూ.4,116లు, తృతీయ బహుమతిగా రూ.3,116లు, నాలుగు నుండి 6వ స్థానం వరకు బహుమతిగా రూ.1,116లు, ఏడు నుండి 10వ స్థానం వరకు బహుమతులుగా రూ.516లు, 11 నుండి 15వ స్థానం వరకు ఒక్కొక్కరికి రూ.316లు బహుమతిగా అందజేస్తామని ప్రకటించారు. 6కె, 4కె రన్‌లోని విజేతలకు నగదు పురస్కారాలు అందజేయనున్నామన్నారు. ఈ పోటీలో పాల్గొనేవారు స్టేడియం కార్యాలయంలో వారి పేర్లను ఈ నెల 15వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని యలవర్తి కోరారు. ఈ సమావేశంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, కమిటీ సభ్యులు పర్వతనేని ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

పామర్రు,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వ అందించే రాయితీలు, ఇతర ప్రయోజనాలు పోందేందుకు అగ్రిస్టేక్‌లో 11 అంకెలతో కూడిన ఐడీ తప్పనిసరిగా రైతులు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి నూతలపాటి పద్మావతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కోండిపర్రు, రిమ్మనపూడి గ్రామాల్లో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో ఈపథకం గురించి మాట్లాడుతూ రైతులకు కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు అందించే ప్రయోజనాలు పోందడం కోసం తప్పనిసరిగా అగ్రిస్టేక్-రైతు పార్శట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు సమీపంలోని ఆర్ఎస్‌కేల వద్దకు వెళ్లి పట్టాదారుపాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్ లింక్‌డ్ అయిన ఫోన్ నెంబర్‌తో వీఏఏలను సంప్రందిస్తే నమోదు పక్రియను పూర్తి చేయనున్నామన్నారు. ఇలా చేయించుకోని వారికి ప్రభుత్వం అందించే ప్రయోజనాలు పోందే అవకాశం కోల్పోతారని తెలిపారు. అదేవిధంగా మినుము పైరుకు అశించే తెగుళ్ల నివారణకు సమగ్ర సస్య రక్షణ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో పామర్రు ఏడిఏ బి. స్వర్ణలత, మండల వ్యవసాయాధికారి వి.శివనాగరాణి, వీఏఏలు, అయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న పద్మావతి

గంగానమ్మతల్లి ఆలయ జీర్ణోర్ధరణకు నిర్ణయం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న యదుచంద్ర పూర్ణ ప్రసాద్, జగన్మోహిని దంపతులు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు గ్రామంలో వంద సంవత్సరాల పూర్వం నిర్మించిన గ్రామ దేవత గంగానమ్మతల్లి అమ్మవారి ఆలయం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో గ్రామ పెద్దలు ఆలయాన్ని జీర్ణోర్ధరణ చేయాలని సంకల్పించారు. కాగా గ్రామంలో పెద్దలు జీర్ణోర్ధరణ కమిటీగా ఏర్పడి సమావేశం నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి గ్రామ ఆడపడచు లండన్‌లో స్థిరపడిన ప్రవాస భారతీయులు డాక్టర్ జగన్మోహిని, ఆమె భర్త డాక్టర్ సూర్యదేవర యదుచంద్ర పూర్ణ ప్రసాద్ దంపతుల తరపున ఆలయ నిర్మాణానికి రూ. 10 లక్షలు ప్రకటించారు. కాగా జగన్మోహిని దంపతులు, డాక్టర్ సుచేత్, డాక్టర్ సందీప్ ల విరాళం రూ. 5 లక్షలు జీర్ణోర్ధరణ కమిటీకి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వల్లభనేని వెంకటరావు, చాపరాల రాజేశ్వరరావు, ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు, వల్లభనేని నరసింహారావు, పోలవరపు వెంకటరావు, వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, కోలా రాధాకృష్ణ, యెనిగళ్ల నాగేశ్వరరావు, వల్లూరుపల్లి వెంకటేశ్వరరావు, అడుసుమిల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంకులో తనిఖీలు



పెట్రోల్ బంకులో తనిఖీ చేస్తున్న ఆర్డీవో షారోన్

కూచిపూడి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలంలో బుధవారం సాయంత్రం ఉయ్యూరు ఆర్డీవో బీఎస్.హెచ్.షారోన్ స్థానిక అధికారులతో కలసి పర్యటించారు. అయ్యంకి పంచాయతీ పరిధిలోని పెట్రోల్ బంకు కోసం దరఖాస్తు చేసుకున్న భూమిని పరిశీలించారు. అలాగే మొవ్వ పరిధిలో గల ఇండియన్ ఆయిల్ బంక్ పని తీరును పరిశీలించారు. మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ నెల 27వ తేదీన జరిగే కృష్ణా, గుంటూరు జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.మస్తాన్, సివిల్ సప్లయిస్ డీడీ కెశ్రీనివాసరావు, రీ సర్వే డీటీ పి.జగన్మోహనరావు, మండల సర్వేయర్ ఏ.కిషోర్‌బాబు, ఆర్ఐ విజయ దుర్గ, ఆయా సచివాలయాల వీఆర్వోలు, సచివాలయాల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

వెండిఆభరణం విరాళం

పామర్రు: పామర్రు పరిధిలోని ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద వేంచేసియున్న వీరాంజనేయ స్వామి ఆలయంలోని మూల వీరాట్‌కు అలంకరణ నిమిత్తం స్థానిక వాస్తవ్యులు సుంకర సత్యనారాయణ కుటుంబసభ్యులు దుర్గా ప్రసాద్ దంపతులు బుధవారం రూ.50వేల విలువగల రెండు వెండి వస్తువులను వితరణగా ఈవో పీవీయస్‌వీ ప్రసాద్‌కు అందజేసినట్టు తెలిపారు.

ప్రత్యేక పూజలు

గుడివాడ రూరల్: గుడివాడ రూరల్ మండలం చిన్న ఎరుకపాడులో నిర్వహిస్తున్న అష్టలక్ష్మీ దేవాలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో అనేక ర కాల పూజలు, యజ్ఞాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు అష్టలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుని హోమ యజ్ఞాల్లో పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ ఆకస్మిక దాడులు



అధికారులకు సూచనలిస్తున్న విజిలెన్స్‌శాఖ అధికారులు

కూచిపూడి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ శాఖ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించి అదనపు లోడుతో ఉన్న 200 సర్వీసులను గుర్తించి రూ.6.12 లక్షల అపరాధ రుసుం విధించినట్లు మొవ్వ మండల విద్యుత్ శాఖ ఏఈ రమేష్, ఎల్ఐ శ్రీహరిలు తెలిపారు. మొవ్వ, కోసూరు, అయ్యంకి, కాజ సబ్ స్టేషన్ల పరిధిలో 39 బృందాలు 2898 సర్వీసులు తనిఖీలు చేపట్టారు. విద్యుత్ శాఖ ఈఈలు జి.గోవిందరావు, సిహెచ్.వాసు ఆధ్వర్యంలో పామర్రు, పెడన, మచిలీపట్నం డిఈలు, ఏఈలు, ఎల్ఐలు, పలువురు అధికారులు, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

త్రోబాల్‌లో జెడ్పీ విద్యార్థుల ప్రతిభ

పెదపారుపూడి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ హైస్కూల్‌లో నిర్వహించిన 84వ గ్రిగ్ మెమోరియల్ బాలికల సెంట్రల్ జోన్ ఆటల పోటీల్లో త్రోబాల్ విభాగంలో వానపాముల జిల్లా పరిషత్ హైస్కూల్ సీనియర్ బాలికల జట్టు కృష్ణాజిల్లా విజేతలుగా నిలిచారని పాఠశాల వ్యాయామోపాధ్యాయులు బూరగడ్డ అనిల్ కుమార్ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పీవీ.ఆర్.రాఘవేంద్రరావు, రావూరి సాదిక్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ జుజ్జవరపు భాను ప్రసాద్ (బాజీ) విజేతలైన విద్యార్థులను అభినందించారు. జూనియర్ కబడ్డీ విభాగంలో వెంట్రప్రగడ హైస్కూల్ బాలికల జట్టు కృష్ణా జిల్లా విజేతలుగా రాణించారని ప్రధానోపాధ్యాయులు హరికిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామోపాధ్యాయులు రాంబాబును, విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.



విజేతలైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

దివీస్ లేబోరేటరీస్‌కు 20 మంది ఎంపిక



కొలువులు సాధించిన ఫార్మసీ విద్యార్థులు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు వీవీ.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో బుధవారం ప్రఖ్యాత ఫార్మా కంపెనీ దివీస్ లాబోరెటరీస్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ వారు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. తమ విద్యార్థులు 20 మంది కొలువులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. రాత పరీక్ష నిర్వహించి అందులో ఎంపికైన వారిని టెక్నికల్ ఇంటర్యూలు నిర్వహించి 20 మందిని ఎంపిక చేశారని ఆయన తెలిపారు. ఎంపిక చేసుకొన్న వారికి ప్రొడక్షన్, క్వాలిటీ ఎష్యూరెన్స్ క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో శిక్షణ ఇచ్చి తగిన పోస్టులు ఇవ్వనున్నారన్నారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.కె నాగుల్ మీరావలి పాల్గొన్నారు.

టిడ్కోకాలనీలో సమస్యల పరిష్కారం

గుడివాడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : గుడివాడమండలం మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో రోజురోజుకు పెరిగిపోతున్న చెత్తను తొలగించడానికి మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేసి తొలగించారని బీజేపీ టూటౌన్ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అభినందించారు. బుధవారం టిడ్కో కాలనీలో ప్రజాసమస్యలు తెలుసుకుని స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి సమస్యలను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆర్.కె కమిషనర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోనం గోపిక, లంకా రాంబాబు, రీటా, చరణ్, టిడ్కో కాలనీవాసులు పాల్గొన్నారు.



చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది



బాస్కెట్‌బాల్ పోటీలో గెలుపొందిన విద్యార్థులు

మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 8 నుండి 11వ తేదీ వరకు పీఠాపురంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన 8వ రాష్ట్రస్థాయి యూత్ బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో కృష్ణాజిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించింది. జిల్లా జట్టులో ఆడిన స్థానిక మాంటిస్సోరి విద్యార్థులు షేక్ అబ్దుల్ రహమాన్, ఎ.శివలు ప్రతిభ చాటి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. బుధవారం స్థానిక పాఠశాలలో బాస్కెట్‌బాల్ క్రీడాకారులను పాఠశాల పాలకవర్గ అధ్యక్షులు వి.లక్ష్మీ, కరస్పాండెంట్ పీవీవీ రమాదుర్గలు, ప్రధానోపాధ్యాయులు జి.పద్మావతి, వ్యాయామోపాధ్యాయులు జి.శ్రీనివాస్, యమ్.సత్యఅన్వేష్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కళాకారులకు పింఛన్ల పంపిణీ

గుడివాడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : మధురగాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 51వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి కళాకారుల సమాఖ్య గౌరవాధ్యక్షులు బి. రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సంగీత విభావరి నిర్వహించారు. ప్రముఖ గాయకులు ఎ.సునీత, భానుమతి, మానస, టికె నాగరాజు, శనగపాటి నాగేశ్వరరావు, ఆర్‌టీసీ శ్రీనివాసరావులు పాడిన పాటలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం 20మంది కళాకారులకు నెలనెలా అందించే రూ.1000ల పింఛన్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు విన్నకోట సత్యనారాయణ(బుజ్జి), కార్యదర్శి పి.ఎస్ బాబు, సభ్యులు పాత శ్యామ్, లోయ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి

గుడివాడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ స్టేడియం మాజీ కన్వీనర్ కీర్తిశేషులు పర్వతనేని జగన్మోహనరావు 20వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక ఎస్‌జీఆర్‌కే మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని స్టేడియం కమిటీ మాజీసంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ అందజేశారు. వడ్లమూడి నరసింహారావు, బొప్పన రమేష్, దుక్కిపాటి సత్యభూషణ్, సేవాసంఘం సభ్యులు కె.అజయ్‌కుమార్, సత్యం, హరిబాబు, తాతారావు, పాఠశాల ఉపాధ్యాయులు టి.సుగుణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాంసం దుకాణాల వద్ద పరిశుభ్రత ముఖ్యం

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బర్డ్‌ఫ్లూ విజృంభిస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టరు బాలాజి ఆదేశాల మేరకు గుడ్లవల్లేరు గ్రామ పంచాయితీ వారు బుధవారం గ్రామంలోని మాంసం దుకాణదారులకు పలు సూచనలు చేశారు. దుకాణ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గోదావరి జిల్లాల నుండి వచ్చే కోళ్లను ఇక్కడికి దిగుమతి చేసుకోవద్దని అలాంటి మంసాన్ని ఇక్కడ విక్రయించరాదని సూచించారు. గ్రామస్థులు కోడి మాంసం, కోడి గుడ్లు హాఫ్ బాయిల్డ్, తినకుండా ఉడటం మంచిదన్నారు. జ్వరం, జలుబు,దగ్గు వంటివి వస్తే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శి నరసింహారావు విజ్ఞప్తి చేశారు.